Follow: @ANNTELUGU

07-05-2025

ANN తెలుగు

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 155 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## రేవంత్.. రాజీనామా చెయ్

- పాలన చేతకాకపోతే రాష్ట్రం పరువు తియ్యొద్దు
- ఆపద వచ్చినప్పుడు ప్లానింగ్, కమిట్‌మెంట్ ఉండాలి
- మీ వ్యాఖ్యలు ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్



03

## రేవంత్ ముక్కుసూటి మనిషి

- ఆ మాటలు సీఎం ఆవేదనగా భావించాలి
- ఉన్నది ఉన్నట్టు చెప్తారు.. అనవసర ఆరోపణలొద్దు
- ఎట్టి పరిస్థితుల్లో పథకాలు ఆపే ప్రసక్తే లేదు
- మంత్రి శ్రీధర్ బాబు



03

## ఉన్నది ఉన్నట్లు చెబితే తప్పేముంది?

- సీఎం మాటలు అవహేళన చేయడం మూర్ఖత్వం
- ప్రభుత్వం బాధను పేదలతో పంచుకోవద్దా?
- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి సీతక్క



02



## వెల్కమ్.. వెల్కమ్!

### ఐదు దేశాల మిస్ కంటెస్టెంట్ల రాక

మహా: మిస్ వరల్డ్ పోటీలకు సమాయత్తం అవుతుండటంతో విదేశీ అతిథుల రాక పెరిగింది. ఈ పోటీల్లో పాల్గొనేందుకు కంటెస్టెంట్లు, అతిథుల రాకతో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ సందడిగా మారింది. మంగళవారం వివిధ దేశాలకు చెందిన మిస్ పోటీదారులు హైదరాబాద్‌కు వచ్చారు. శంషాబాద్ ఎయిర్ పోర్టుకు రాగానే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం అధికారులు ఘన స్వాగతం పలికారు. నృత్యాలు, డప్పులతో స్వాగతించారు. హైదరాబాద్‌కు మిస్ ఇండియా నందిని గుప్తా, మిస్ మెక్సికో మార్యేలీ లీయల్ సెర్వాంటెస్, మిస్ నెదర్లాండ్స్ జేన్ షానీ కొనెస్టర్, మిస్ ఫ్రాన్స్ అగథా లో కాయేట్, మిస్ కిర్గిజ్స్తాన్ అయాజన్ చాణచేవా, మిస్ గ్వాటెమాల జేమీ యులియానా ఎస్కోబెడో రీస్ వచ్చారు. అలాగే ప్రముఖ నటుడు సోను పంకజ్ సూద్ రాగా ఆయనకు అధికారులు స్వాగతం పలికారు.




## 100 డ్రోన్‌లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్

### మాస్కోలో విమానాశ్రయాల మూసివేత

మహా : యుద్ధం ముగించేందుకు ఓవైపు అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ రష్యా ఉక్రెయిన్ పరస్పర దాడులు కొనసాగిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా భారీస్థాయిలో విరుచుకుపడడంతో..కీవ్ పెద్ద ఎత్తున ప్రతీకార దాడులు చేస్తోంది.

వివరాలు 2లో



## కేటీఆర్.. సినిమా డైలాగ్గొద్దు

- కాంగ్రెస్ వాళ్ల నాలుకలు చీరడం సాధ్యమా?
- రఘునందన్ రాజకీయంగా చాలా చిన్నోడివి
- కేటీఆర్, రఘునందన్ రావుపై జగ్గారెడ్డి మండిపాటు

వివరాలు 2లో



## ఇది షో పాలిటిక్స్ కాదు

- ఉన్నది ఉన్నట్లు మాట్లాడితే తప్పా?
- అప్పుల పాలు చేసినోళ్లే అబద్ధాలాడుతున్నరు
- అప్ప ఉందని చెప్పకపోతే ప్రజలను మోసం చేసినట్లైతది
- ప్రతి నెలా అప్పుల వడ్డీలకు రూ.6,500 కోట్లు వెచ్చిస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

వివరాలు 2లో



# ఓబులాపురం మైనింగ్ కేసులో.. సంచలన తీర్పు

JUDGMENT

### సబితా ఇంద్రారెడ్డికి సీబీఐ కోర్టు క్లీన్ చిట్

**గాలి జనార్దన్ రెడ్డి సహా నలుగురు దోషులు**

అందరికీ ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. లక్ష జరిమానా

పదిహేనేళ్ల పాటు సాగిన ఓబులాపురం మైనింగ్ కేసు విచారణ

ఓఎంసీ ఆక్రమణలు, అక్రమ మైనింగ్‌పై 2009లో సీబీఐ కేసు నమోదు

కన్నీళ్లతో కోర్టు మెట్లెక్కా: తీర్పుపై సబితా ఇంద్రారెడ్డి ఎమోషనల్

## సబితకు రిలీఫ్

ఈ మైనింగ్ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి సీబీఐ కోర్టులో ఊరట దక్కింది. ఈ కేసులో ఏ 1 నుంచి ఏ 7 వరకు సీబీఐ కోర్టు శిక్ష ఖరారు చేసింది. ఏ8 కృపనందం, ఏ 9 సబితా ఇంద్రారెడ్డిలను నిర్దోషులుగా ప్రకటించింది. ఓబులాపురం మైనింగ్ కేసులో తనను నిర్ధోషిగా సీబీఐ కోర్టు ప్రకటించడం పట్ల మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఆమెను సీబీఐ కోర్టు నిర్ధోషిగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. తనను నిర్ధోషిగా ప్రకటించిన కోర్టుకు ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపారు. 12 ఏళ్ల పాటు ఈ కేసులో న్యాయం కోసం పోరాటం చేశానన్నారు. ఈ సందర్భంగా పలు అవమానాలు సైతం తాను ఎదుర్కొన్నానని ఆమె గుర్తు చేసుకున్నారు.

హైదరాబాద్, మహా: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఓబులాపురం మైనింగ్ కంపెనీ కేసులో హైదరాబాద్ సీబీఐ కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసులో గాలి జనార్ధన్ రెడ్డి, మెఫజ్ అలీఖాన్, వీడీ రాజగోపాల్, బీవీ శ్రీనివాసరెడ్డి,ఓఎంసీ కంపెనీని కోర్టు దోషులుగా తేల్చింది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కృపానందంను నిర్ధోషులుగా ప్రకటించింది. అయితే ఓఎంసీ ఆక్రమణలు, అక్రమ మైనింగ్‌పై 2009లో సీబీఐ కేసు నమోదు చేసింది.

మిగతా 2లో

# ఆర్టీసీ సమ్మె వాయిదా

### మంత్రితో కార్మిక జేఏసీ చర్చలు సఫలం..

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం

ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు.. వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె బాట: ఆర్టీసీ జేఏసీ నేతలు



**మహా** : తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మె వాయిదా పడింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఆర్టీసీ జేఏసీ నేతలు జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె వాయిదా పడింది. ఉద్యోగుల సమస్యలపై ముగ్గురు ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. నవీన్ మిత్తల్, లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్‌లతో కూడిన ఈ కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చించి సమస్యలకు పరిష్కారాలను సూచించనుంది. వారం రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఈ కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. డిపోల్లో ఏయే సమస్యలు ఉన్నాయి? ఉద్యోగులు, కార్మికుల పని భారం, ఒత్తిళ్లు వంటి అంశాలకు పరిష్కారం ఏమిటనే అంశాలపై జేఏసీ నేతలతో మంత్రి చర్చించారు.


మిగతా 2లో

## మినీ అంగన్‌వాడీ టీచర్లకు ప్రమోషన్

వివరాలు 3లో

## దేశం వైపు చూడాలంటే భయం పుట్టాలె

- కేంద్రానికి ప్రతిపక్షం తరపున పూర్తి మద్దతు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ట్వీట్
- లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కుటుంబానికి పరామర్శ



**ఢిల్లీ, మహా:** కేంద్రానికి ప్రతిపక్షం తరపున పూర్తి మద్దతు ఉంటుందని ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఉగ్రవాదులు ఇండియా వైపు కన్నెత్తి చూడాలంటే భయపడేలా చర్యలు తీసుకోవాలని ట్వీట్ చేశారు.

మిగతా 2లో



## అందాల పోటీలకు పైసలున్నయా?

### హామీలు అమలు చేసేందుకు ఉండవా?

- దొంగ చేతికి తాళాలిస్తే అప్పేట్లా పుడ్తది
- పాలన చేతకాక పోతే రేవంత్ రాజీనామా చెయ్
- 17 నెలల పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- పరిపాలన అంటే బజారు భాష మాట్లాడినంత ఈజీ కాదు
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, మహా: స్వతంత్ర భారతదేశంలోనే అత్యంత అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి అని, ఉద్యోగుల త్యాగాల గురించి ఇసుమంత కూడా తెలియదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

మిగతా 2లో



## యుద్ధానికి సన్నద్ధం

- సరిహద్దు గ్రామాల్లో శరవేగంగా బంకర్ల నిర్మాణాలు
- బాంబులు ప్రభావం చూపనంత బలంగా నిర్మాణం
- ప్రతీ బంకర్‌లో రెండు గదులు, టాయిలెట్, భోజన ప్రాంతం
- ఒక్కో బంకర్‌లో 50 మంది కూర్చునే వీలు

02

## తెలంగాణ గొప్ప అనుభూతి.. హైదరాబాద్ బిర్యాని అమోఘం

### మిస్ ఇండియా నందిని గుప్తా

హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలకు సర్వం సిద్ధం

తెలంగాణ సంస్కృతి, అభివృద్ధి గొప్పవన్న మిస్ ఇండియా నందిని గుప్తా

పోటీలు రాష్ట్రానికి గర్వకారణమన్న మంత్రి జూపల్లి కృష్ణారావు

సామాన్యులు కూడా పోటీలను వీక్షించేందుకు పర్యాటక శాఖ ఏర్పాట్లు

**మహా:** హైదరాబాద్ నగరం ప్రతిష్ఠాత్మక ప్రపంచ సుందరి (మిస్ వరల్డ్) పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఈ అంతర్జాతీయ వేడుక కోసం వందకు పైగా దేశాల నుంచి అందాల భామలు భాగ్యనగరానికి తరలివస్తున్నారు. వారికి ఘన స్వాగతం పలికేందుకు శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మిగతా 2లో



# దేశం వైపు చూడాలంటే భయం పుట్టాలె

(మొదటి పేజీ తరువాయి)



పహల్గామ్ ఉగ్ర దాడిలో మృతి చెందిన నేవీ అధికారి వినయ్ నర్వాల్ కుటుంబాన్ని రాహుల్ గాంధీ పరామర్శించారు. ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా పంచుకున్న ఆయన.. ఉగ్రదాడిపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ దాడిలో అమరులైన లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కుటుంబ సభ్యులను కలిసి, వారి బాధను పంచుకున్నానని అన్నారు. అలాగే వారిని ఓదార్చేందుకు ప్రయత్నించానని చెప్పారు. అపారమైన దుఃఖ సమయంలో కూడా వారి ధైర్యం దేశానికి ఒక సందేశం అని, దేశమంతా ఐక్యంగా ఉండి పోరాడాలని వారు చెబుతున్నట్లు తెలిపారు. ఇక దేశం మొత్తం అమరవీరుల కుటుంబాలకు అండగా నిలుస్తుందని, ప్రతిపక్షం ప్రభుత్వానికి పూర్తిగా మద్దతు ఇస్తుందని రాహుల్ గాంధీ మరోసారి స్పష్టం చేశారు. ఈ కేసులో పలువురు అధికారులు జైలు జీవితం గడిపారు. 2022లో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని కేసు నుంచి కోర్టు డిశ్చార్జ్ చేసింది.

**15 ఏళ్ల సుదీర్ఘ విచారణ**

ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు ఇచ్చింది. 15 ఏళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం అక్రమ మైనింగ్ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా తేల్చింది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్‌గా ఉన్న వీడీ రాజగోపాల్‌ను దోషులుగా గుర్తించి శిక్షలు ఖరారు చేసింది. ఈ కేసులో ఏ1 బీవీ శ్రీనివాసరెడ్డి, ఏ2 గాలి జనార్దన్ రెడ్డి, ఏ3 వీడీ రాజగోపాల్, ఏ4 ఓఎంసీ కంపెనీ, ఏ7 మెఫజ్ అలీఖాన్‌లను దోషులుగా తేల్చి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. గాలి జనార్దన్ రెడ్డి సహా ఐదుగురికి ఏడుళ్ల పాటు జైలు శిక్ష విధించింది. ఈ కేసులో అప్పటి గనుల శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఊరట లభించింది. ఆమెతో పాటు అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంను సీబీఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.

# అందాల పోటీలకు పైసలున్నయా?

(మొదటి పేజీ తరువాయి)

'నన్ను కోసినా ఉన్న ఆదాయానికి మించి ఉద్యోగులకు పైసా ఇవ్వలేను' అని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ఎన్జీవోల త్యాగల స్ఫూర్తితో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, ఉద్యోగులకు మాజీ సీఎం కేసీఆర్ 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారన్నారు. ఉద్యోగాలు పోయినా.. తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యోగులపై సీఎం రేవంత్ రెడ్డి మాటలు బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిందే ఉద్యోగులు అడుగుతున్నారని, ప్రజల ముందు ఉద్యోగులను విలన్‌లుగా చిత్రీకరించే కుట్ర రేవంత్ రెడ్డి చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. తండ్రి లాంటి ముఖ్యమంత్రే సొంత రాష్ట్రానికి శాపాలు పెట్టడం స్వతంత్ర భారతదేశంలో ఎక్కడా లేదని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ఈ శతాబ్దపు మోసమని, వ్యక్తిగతంగా తమపై చేసిన రోత మాటలను సైతం పడ్డామని.. తెలంగాణను శపిస్తే సహించమని కేటీఆర్ స్పష్టం చేశారు. అందాల పోటీలకు రూ, 200 కోట్లు ఉన్నాయి కానీ.. ఉద్యోగులకు ఇవ్వటానికి డబ్బులు లేవా అని ప్రశ్నించారు. నాయకత్వ లోపం.. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు పెట్టిన శాపం అని అన్నారు. పరిపాలన చేతకాదని..



ముఖ్యమంత్రి కాడి పడేశారని విమర్శించారు. నోట్ల కట్లతో దొరికిన రేవంత్ రెడ్డి.. దొంగ కాక మరేంటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి దొంగ కాబట్టే.. అప్పు పుట్టడం లేదన్నారు. కాంగ్రెస్ లాంటి ఎర్రి పార్టీ.. దొంగ చేతికి తాళాలు ఇచ్చిందని అన్నారు. రేవంత్ రెడ్డిని సీఎం చేసి.. ఏఐసీసీ, రాహుల్ గాంధీ చాలా పెద్ద తప్పు చేశారన్నారు. తెలంగాణ భవిష్యత్తుకు శాపం పెట్టే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారని, ఢిల్లీ పార్టీలను నమ్మితే మోసపోతామన్న కేసీఆర్ మాటలు నిజమయ్యాయన్నారు. ఇంత దివాలాకోరు మాటలు ఏ రాజకీయ నాయకుడు మాట్లాడలేదన్నారు. అధికారంలోకి వస్తామని.. కాంగ్రెస్ పార్టీ అనుకోలేదని, అందుకే విచ్చలవిడిగా హామీలు ఇచ్చిందని కేటీఆర్ తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు.

**తెలంగాణ కాదు.. కాంగ్రెస్..**

తెలంగాణ దివాలా తీస్తే.. సీఎం కుటుంబం అస్తులు ఎలా పెరుగుతున్నాయని, సీఎం అన్న జగదీష్ రెడ్డి వెయ్యి కోట్లు పెట్టుబడులు పెట్టేస్థాయికి ఎలా ఎదిగారని కేటీఆర్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అల్లుడు, వియ్యంకుడు అప్పులు మాఫీ అయిపోయాయని, ఏడాదిలో సీఎం రేవంత్ రెడ్డి 2 వేల ఎకరాలు కొన్నారని ఆరోపించారు. సీక్రెట్ చెప్తే.. తెలంగాణ ప్రజలు కూడా ఆస్తులు పెంచుకుంటారన్నారు. అభివృద్ధి కోసం కేసీఆర్ హయాంలో అప్పులు చేసిన మాట వాస్తవమని అన్నారు. అందాల పోటీలపై రివ్యూ చేస్తున్న కమాండ్ కంట్రోల్ సెంటర్ కూడా కేసీఆర్ కట్టారని తెలిపారు. ఒకవైపు దివాలాకోరు మాటలు.. మరోవైపు తెలంగాణ రైజింగ్.. ఏది వాస్తవమని అన్నారు. పరిపాలన చేతకాకుంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. కేసీఆర్‌ను ఇకపై వ్యక్తిగతంగా మట్లాడితే రేవంత్ రెడ్డి నాలుక చీరేస్తామన్నారు. ఎకానమీ క్లాస్‌లో ప్రయాణం చేస్తున్నానని సీఎం అబద్ధాలు చెప్తున్నారని, సీఎం ప్రైవేట్ ట్రిప్పులు, జలసాలను బయట పెడతామన్నారు. నల్లగొండ మంత్రులు హెలికాప్టర్‌ను షేర్ ఆటో కంటే అధ్వానంగా వాడుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌కు రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వటం లేదని, తెలంగాణ కాదు.. కాంగ్రెస్ పార్టీ దివాలా తీసిందన్నారు. ముఖ్యమంత్రి సోదరుల అరాచకాల వలనే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయిందన్నారు. అడ్డమైన మాటలు బంద్ చేసి.. రేవంత్ రెడ్డి బుర్ర పెంచుకోవాలని, రేవంత్ రెడ్డి హాయాంలో లిక్కర్ మాత్రమే పెరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఆర్టీసీ సమ్మె వాయిదా

(మొదటి పేజీ తరువాయి)



దాదాపు మూడు గంటల పాటు కొనసాగిన ఈ చర్చల్లో ఆర్టీసీ విలీనం అంశంపైనా సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ఈ చర్చల అనంతరం ఆర్టీసీ జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడుతూ.. "ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. ప్రైవేటు విద్యుత్తు బస్సుల గురించి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, ప్రభుత్వమే విద్యుత్తు బస్సులు కొని ఆర్టీసీకి ఇచ్చేలా చర్యలు చేపడతామని మంత్రి అన్నారు. కారుణ్య నియామకాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, సింగరేణి మాదిరిగా రెగ్యులర్ ప్రాతిపదికన కారుణ్య నియామకాలు చేపట్టాలని మేం కోరామన్నారు. విశ్రాంత ఉద్యోగుల బకాయిలు, వేతన సవరణ గురించి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. మా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి కొంత సమయం ఇచ్చేలా, దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సమ్మెను కొంత కాలం పాటు వాయిదా వేయాలని నిర్ణయించుకున్నాం. మా సమస్యల్ని పరిష్కరించకపోతే కచ్చితంగా మళ్లీ సమ్మె తేదీని ప్రకటిస్తాం. ఇది తాత్కాలిక వాయిదా మాత్రమే" అని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేయాలని ఇటీవల టీజీఎస్ఆర్టీసీ ఐకాస నేతలు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి వరకు చర్చలకు ఆహ్వానం రాకపోతే మే 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించారు. ఈ క్రమంలోనే సోమవారం భారీ కవాతు సైతం నిర్వహించారు. తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

# యుద్ధానికి సన్నద్ధం

- సరిహద్దు గ్రామాల్లో శరవేగంగా బంకర్ల నిర్మాణాలు
- బాంబులు ప్రభావం చూపనంత బలంగా నిర్మాణం
- ప్రతీ బంకర్‌లో రెండు గదులు, టాయిలెట్, భోజన ప్రాంతం
- ఒక్కో బంకర్‌లో 50 మంది కూర్చునే వీలు



**మహా:** జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య యుద్ధ మేఘాలు అలుముకున్నాయి. త్వరలోనే పాకిస్థాన్‌పై భారత్ దాడి చేస్తుందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో జమ్మూలోని అంతర్జాతీయ సరిహద్దుకు ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో భూగర్భ బంకర్ల నిర్మాణాన్ని భారత ప్రభుత్వం వేగవంతం చేసింది. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి జమ్ము కశ్మీర్ సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్ సైన్యం ఎడతెరిపి లేకుండా కాల్పులు జరుపుతోంది. ఈ కాల్పుల నుంచి సరిహద్దు ప్రాంత ప్రజలను రక్షించడానికి భారత ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన బంకర్ల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు రక్షణ వర్గాలు చెబుతున్నాయి.

**సరిహద్దులోని సాంబా జిల్లా ప్రజలు హైఅలర్ట్**

పాకిస్థాన్‌తో సరిహద్దు కలిగిన జమ్ము కశ్మీర్‌లోని సాంబా జిల్లాలోనూ ప్రజలు అలర్ట్ అయ్యారు. భారత్ పాక్ యుద్ధం జరగొచ్చనే ఆందోళనతో ఈ జిల్లాలోని రామ్‌గఢ్ గ్రామస్థులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. యుద్ధం జరిగితే తమ ప్రాణాలను, ఆస్తులను కాపాడుకోవడానికి గ్రామంలో భూగర్భ బంకర్లను నిర్మించుకుంటున్నారు. ముఖ్యంగా అధిక జనసాంద్రత కలిగిన చాలా గ్రామాల్లోనూ డజన్ల కొద్దీ భూగర్భ బంకర్లను నిర్మించుకుంటున్నారు. "భారత్ పాక్ సరిహద్దుల్లో పరిస్థితి మరింత దిగజారితే మమ్మల్ని మేం రక్షించుకోవాల్సి ఉంటుంది. మా కుటుంబాలు, పిల్లల భద్రత కోసం మేం చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా బంకర్లను నిర్మించుకుంటున్నాం" అని రామ్‌గఢ్ గ్రామస్థులు చెప్పారు. "మేం ప్రస్తుతం యుద్ధ ప్రాతిపదికన బలమైన బంకర్లను నిర్మిస్తున్నాం. ఒక్కో బంకర్ నిర్మాణాన్ని 15 రోజుల్లోనే పూర్తి చేస్తున్నాం. ఇవి పాకిస్థాన్ ఆర్మీ కాల్పులను తట్టుకోగలవు. వాటిలో దాక్కునే ప్రజల ప్రాణాలు నిలుస్తాయి. ఆర్‌సీసీ మెటీరియల్‌తో ఈ బంకర్లను నిర్మిస్తున్నాం. వీటి గోడలు, పైకప్పులు ఒక అడుగు మందంగా ఉంటాయి. ఎలాంటి భారీ దాడులనైనా తట్టుకునేలా ఈ బంకర్ల నిర్మాణంలో అత్యంత బలమైన ఉక్కును ఉపయోగిస్తున్నాం. పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో ఇటువంటి 12 బంకర్లు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి. ప్రతి బంకర్‌లో రెండు గదులు, ఒక టాయిలెట్, ప్రత్యేక భోజన ప్రాంతం ఉంటాయి. ఒక్కో బంకర్‌లో దాదాపు 50 మంది కూర్చోవచ్చు." అని స్థానికులు తెలిపారు. గతంలోనూ భారత్ పాక్ యుద్ధాలు జరిగాయి. అప్పట్లోనే జమ్ముకశ్మీర్‌లో వందలాది కుటుంబాలు బంకర్లను నిర్మించుకున్నాయి. యుద్ధ సమయాల్లో రక్షణ కోసం వాటిని సిద్ధంగా ఉంచుకున్నాయి. తాజాగా మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం వల్ల ఇప్పుడు అలాంటి బంకర్లు మరిన్ని రెడీ అవుతున్నాయి.

# కేటీఆర్.. సినిమా డైలాగ్లొద్దు

## కేటీఆర్, రఘునందన్ రావుపై జగ్గారెడ్డి మండిపాటు

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేపీ ఎంపీ రఘునందన్ రావు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ నాలుక కోరకడంతో ఏమైతదని ఆయన వ్యంగ్యంగా ప్రశ్నించారు. కాంగ్రెస్ వాళ్ల నాలుకలు చీరడం సాధ్యమా? అంటూ కేటీఆర్‌ను ఈ సందర్భంగా ప్రశ్నించారు. కేటీఆర్ సినిమా స్క్రిప్ట్ చదివి డైలాగులు చెప్తాడంటూ ఎద్దేవా చేశారు. సత్తా లేనిదే సీఎం రేవంత్ సంవత్సరంలో రైతులకు రుణమాఫీ చేశారా? అని కేటీఆర్‌ను సూటిగా నిలదీశారు. సత్తా లేనిదే ప్రమాణస్వీకారం చేసిన గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ఇచ్చామా? అని కేటీఆర్‌ను అడిగారు. తమ ప్రభుత్వం పబ్లిసిటీ చేసుకోవడం లేదు కానీ.. సంవత్సరంలో వేలాది ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కేసీఆర్, హరీశ్ రావు సైలెంట్‌గా ఉన్నారు కాబట్టే బీజేపీ ఎంపీగా రఘునందన్ గెలిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గెలవకూడదని కేసీఆర్, హరీశ్ రావులు అనుకున్నారు కాబట్టే రఘునందన్ రావు గెలిచారని ఆయన వివరించారు. రాజకీయంగా రఘునందన్ చాలా చిన్నోడన్నారు. నువ్వు నా సీఎంని ఏమనకపోతే నేను మీ పీఎంను ఏం అనకపోదునంటూ రఘునందన్ రావుకు జగ్గారెడ్డి చురకలంటించారు. నల్లధనాన్ని ప్రజలకి పంచుతానని ప్రధాని మోదీ ఇచ్చిన హామీ ఏమైందంటూ రఘునందన్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు.

# 100 డ్రోన్‌లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్

## మాస్కోలో విమానాశ్రయాల మూసివేత

(మొదటి పేజీ తరువాయి)



తాజాగా ఉక్రెయిన్ 100కు పైగా డ్రోన్లతో మాస్కోలోని డజనుకు పైగా ప్రాంతాలపై విరుచుకుపడింది. అయితే పలు డ్రోన్లను తాము సమర్థవంతంగా కూల్చేసినట్లు రష్యా పేర్కొంది. డ్రోన్ దాడుల కారణంగా మాస్కోకు సమీపంలోని 4 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మాస్కోలోని ప్రధాన ప్రాంతాల్లో ఉక్రెయిన్ దాడుల వల్ల మరో తొమ్మిది ప్రాంతీయ విమానాశ్రయాలు కూడా స్వల్పంగా ధ్వంసమయ్యాయని.. దీంతో వాటిని మూసేయాల్సి వచ్చిందని రష్యా పౌర విమానయాన సంస్థ రోసావియాట్సియా వెల్లడించింది. మరోవైపు రష్యా సరిహద్దు వద్ద ఉన్న ఉక్రెయిన్‌లోని ఖార్కివ్ నగరంపై రష్యా దళాలు 20కి పైగా డ్రోన్లను ప్రయోగించాయి. ఈ దాడిలో నలుగురు గాయపడగా.. దాదాపు 100 మార్కెట్ స్టాళ్లు ధ్వంసమయ్యాయి. మరో ప్రాంతంలో మాస్కో బాంబులు ప్రయోగించిన ఘటనలో ఏడుగురు పౌరులు గాయపడినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. రెండో ప్రపంచయుద్ధ విజయానికి 80వ వార్షికోత్సవం 'విక్టరీ డే' సందర్భంగా మే 8 నుంచి 10 వరకు మూడు రోజులపాటు రష్యా.. ఉక్రెయిన్‌పై పోరు విరమణను ప్రకటించింది. వాటికన్‌లో పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు హాజరైన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ అయి.. శాంతి ఒప్పంద చర్చలు జరిపిన విషయం తెలిసిందే. అనంతరం మాస్కో తన నిర్ణయాన్ని వెలువరించింది.

# పిక్చర్ అభీ బాకీ హై

- అప్పడే అయిపోలేదు.. త్వరలో ఈడీ ఎంట్రీ ఉంటుంది
- కోర్టు తీర్పుపై స్పందించిన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

**మహా :** ఓబుళాపురం మైనింగ్ కేసులో తుది తీర్పు వచ్చేసింది. 14 ఏళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం ఐదుగురిని దోషులుగా తేలుస్తూ సీబీఐ కోర్టు తీర్పు వెలువరించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ, గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాస్, వీడీ రాజగోపాల్, అలీఖాన్‌లను దోషులుగా నిర్ధారించింది. వీరందరికీ రూ.10 వేల జరిమానాతో పాటు ఏడేళ్ల జైలుశిక్ష విధించింది. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కృపానందంను నిర్దోషులుగా తేల్చింది. తాజాగా కోర్టు తీర్పుపై సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ స్పందించారు. 'మైనింగ్ లీజు ఇవ్వడానికి చాలా ప్రొసీజర్ ఉంటుంది. ఈ కేసులో మొదటి నుంచి పక్షపాతం కనిపించింది. జరిగిన అక్రమాలను నిరూపించేందుకు చాలా ఇబ్బందులు పడ్డాం. ఆధారాలు సంపాదించడం సవాళ్లతో కూడుకున్న పని. అన్ని ఆధారాలు ఉన్నా గాలి జనార్దన్ రెడ్డి అరెస్ట్ సమయంలో చాలా గోప్యతగా ఉండాల్సి వచ్చింది. ఐటీ అధికారులు మారువేశంలో వెళ్లి గాలి జనార్దన్ రెడ్డిని అరెస్ట్ చేశారు. ఓబుళాపురంలో రూ.840 కోట్ల విలువైన ఖనిజాన్ని అక్రమంగా తరలించారు. విషయం తెలుసుకొని తాము రంగంలోకి దిగేటప్పటికే అక్రమ రవాణా మొత్తం పూర్తయింది. తామంతా జరిగిన అక్రమాలను నిరూపించాల్సి వచ్చింది. ఖనిజం తవ్వాలపై అమెరికా నుంచి మ్యాపులు సాధించాం. అక్రమార్కులకు శిక్ష పడితే మిగతా వారిలో భయం కలుగుతుంది. శిక్షలు పడకపోతే భూగర్భ సంపదను విచ్చలవిడిగా దోచే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి ఘటనలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలి. త్వరగా శిక్ష పడేలా చూడాలి. విచారణ సుదీర్ఘంగా సాగితే అనేక మార్పులు వస్తాయి. నిందితులు మాట మార్చే అవకాశం కూడా ఉంటుంది. ఈ కేసు అప్పుడే ముగియలేదు.. త్వరలో ఈడీ దర్యాప్తు కూడా కొనసాగవచ్చు. సీబీఐ కోర్టు తీర్పుపై కొందరు హైకోర్టుకు కూడా వెళ్లే అవకాశం ఉంది. ఫైనల్ కోర్టు తీర్పు నాకు సంతృప్తిని ఇచ్చింది.' అని లక్ష్మీనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు.

# తెలంగాణ గొప్ప అనుభూతి.. హైదరాబాద్ బిర్యాని అమోఘం

## మిస్ ఇండియా నందిని గుప్తా

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో, పోటీల నిర్వహణపై హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

**హైదరాబాద్ ప్రజలు ఆప్యాయతను పంచుతారు: నందిని గుప్తా**

మిస్ ఇండియా నందిని గుప్తా మాట్లాడుతూ, తెలంగాణ గురించి ప్రస్తావించిన ప్రతిసారీ తనకు గొప్ప అనుభూతి కలుగుతుందని అన్నారు. ఈ ప్రాంత సంస్కృతి, అభివృద్ధి అద్భుతంగా ఉన్నాయని ఆమె ప్రశంసించారు. హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, ఇక్కడి ప్రజలు ఎంతో ఆప్యాయతను పంచుతారని తెలిపారు. హైదరాబాదీ బిర్యానీ నుంచి ఇరానీ చాయ్ వరకు స్థానిక వంటకాలు అమోఘంగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి యువతి ఒక ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని నందిని గుప్తా అభిప్రాయపడ్డారు.

**రాష్ట్రానికి గర్వకారణమన్న మంత్రి జూపల్లి కృష్ణారావు**

తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించడం రాష్ట్రానికే గర్వకారణమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ పోటీల కోసం వస్తున్న ప్రతి ఒక్కరికీ మధురానుభూతిని అందించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మిస్ వరల్డ్ గ్లోబల్ యూనిట్‌కు తెలంగాణ వేదిక కావడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్ర సంప్రదాయాలను, పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఇదొక సువర్ణావకాశమని మంత్రి అభివర్ణించారు.

**సామాన్యులకూ ప్రవేశం ఉంటుందన్న పర్యాటక శాఖ కార్యదర్శి**

ఈ పోటీల ద్వారా తెలంగాణ ఆహారం, సంస్కృతి, పర్యాటక ఆకర్షణలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు వీలు కలుగుతుందని పర్యాటక శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. విదేశీ పర్యాటకులను ఆకట్టుకోవడానికి ఇదొక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. అందరం కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేవలం వీవీఐపీలకే పరిమితం అనే భావన లేకుండా, సామాన్యులు కూడా ఈ అందాల పోటీలను వీక్షించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న వారు పర్యాటక శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.



# మినీ అంగన్‌వాడీ టీచర్లకు ప్రమోషన్

- అంగన్వాడీలుగా పదోన్నతి కల్పించిన సర్కార్
- ఈ నెల నుంచి అమల్లోకి రానున్న ఉత్తర్వులు
- మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపిన మినీ అంగన్వాడీలు

**హైదరాబాద్, మహా:** గతంలో అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన హామీని అమలు చేసి రేవంత్ ప్రభుత్వం మాటను నిలబెట్టుకుంది. ఈ మేరకు మినీ అంగన్‌వాడీ టీచర్లకు శుభవార్త చెప్పింది. 3989 మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా ప్రభుత్వం ప్రమోట్ చేస్తూ ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నుంచి అంగన్‌వాడీ టీచర్ల మాదిరిగానే మినీ అంగన్‌వాడీ టీచర్లు వేతనం అందుకోనున్నారు. మినీ, మెయిన్ అంగన్‌వాడీ అన్న తేడా లేకుండా ఇకపై అందరూ అంగన్‌వాడీ టీచర్లేనని స్పష్టం చేసింది. ఈ నెల(మే) నుంచి అమల్లోకి ఉత్తర్వులు రానున్నాయి. ఏప్రిల్ నుంచి మినీ అంగన్‌వాడీ టీచర్లకూ నెలకు రూ.13,650 ఇవ్వనుంది. గతంలో మినీ అంగన్‌వాడీ టీచర్లకు జీతం రూ. 7800ను ఇచ్చింది. ఈ మేరకు మంత్రి సీతక్కకు మినీ అంగన్వాడీ టీచర్లు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇది షో పాలిటిక్స్ కాదు

## ఉన్నది ఉన్నట్లు మాట్లాడితే తప్పా

- అప్పుల పాలు చేసినోళ్లే అబద్ధాలాడుతున్నరు
- అప్పు ఉందని చెప్పకపోతే ప్రజలను మోసం చేసినట్లైతది
- ప్రతి నెలా అప్పుల వడ్డీలకు రూ.6,500 కోట్లు వెచ్చిస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

**పాలేరు, మహా:** ఉన్నది ఉన్నట్లు మాట్లాడితే తప్పా? తప్పు చేసినోళ్ళకే తప్పుగా కనిపిస్తుందని బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో భారీగా అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. సీఎం వ్యాఖ్యల వెనుక ఉన్న వాస్తవాలను మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మంలో మీడియా సమావేశంలో ప్రజలకు వివరించారు. ప్రతి నెలా అప్పుల వడ్డీ చెల్లింపులకు రూ.6,500 కోట్లు వెచ్చిస్తున్నట్టు స్పష్టం చేశారు. అయినప్పటికీ పేదలకు సన్నబియ్యం, ఇళ్ల నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, ఆరోగ్య సేవలు కొనసాగుతున్నాయన్నారు. 'ఇది షో పాలిటిక్స్ కాదు, ఇది ప్రజల పట్ల బాధ్యత' అని పరోక్షంగా బీఆర్ఎస్ పాలనపై దుయ్యబట్టారు. కేసీఆర్ ప్రభుత్వం రూ. 8 నుంచి రూ.19 వేల కోట్లకు పైగా అప్పు చేసిందని ఆరోపణలు చేశారు. వడ్డీకి అప్పు తీసుకువచ్చి తెలంగాణ రాష్ట్రం మీద కేసీఆర్ గుదిబండ పెట్టిందని ఆరోపించారు. ఆ అప్పులు తీర్చుకుంటూ తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని ఉద్ఘాటించారు. నిజాన్ని తప్పుగా మార్చుతూ ప్రజలను బీఆర్ఎస్ నేతలు తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పెద్ద మహా వృక్షం.. ఆ మహా వృక్షం కింద ఎన్ని కోట్ల మంది అయినా సేద తీర్చుకోవచ్చని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఎత్తు పల్లాలు సహజమని అన్నారు. బ్యాంకులను జాతీయం చేసి పేదవారికి ప్రభుత్వ ఆస్తులను కాంగ్రెస్ పంచి ఇచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కూడా కాంగ్రెస్ పార్టీనే అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గుర్తుచేశారు.



ప్రాంతీయ పార్టీలు తారాజువల్ల ఎగిరి కిందపడతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కాంగ్రెస్‌లో పనిచేస్తున్నామని తాము గర్వంగా చెప్పుకుంటామని అన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు జాతీయ, రాష్ట్ర నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల కృషి ఎంతో ఉందని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎప్పుడూ కలిసే ఉంటారని అన్నారు. ఉద్యోగ సంఘాలను బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. మాయమాటలు చెప్పడం ఇందిరమ్మ ప్రభుత్వానికి రాదని అన్నారు. అప్పు ఉందని చెప్పకపోతే ప్రజలను మోసం చేసినట్లు అవుతుందని చెప్పారు. ఎనిమిదో వింత కాళేశ్వరం అని విమర్శలు చేశారు. ఆ ప్రాజెక్ట్ మూడేళ్లలోనే నెర్రులు వచ్చిందని అన్నారు. అబద్ధాలను నిజాలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు తాపత్రయ పడుతున్నారని అన్నారు. వరంగల్ సభను ఆపడానికి ఇందిరమ్మ ప్రభుత్వం చూసిందని బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు చెబుతున్నారని దుయ్యబట్టారు.

మహా పత్రిక 03
తెలుగు
బుధవారం, హైదరాబాద్ | 07-05-2025
జనరల్ వార్తలు | GENERAL NEWS
WWW.MAHAADAILY.COM

# ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు భరోసా కల్పించాలి

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలను బలోపేతం చేయాలి

ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపి, ఐపి, సర్జరీలను పెంచడమే లక్ష్యం

దశలవారీగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను బ్రాండింగ్ చేయాలి

వైద్య రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలి

ఉన్నత స్థాయి సమీక్ష లో మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశా నిర్దేశం



**మహా:** ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం, విశ్వాసం పెరిగేలా మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యం తో ప్రభుత్వ ఆసుపత్రులను బ్రాండింగ్ చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ గారి అధ్యక్షతన నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష లో ప్రభుత్వ ఆసుపత్రుల బ్రాండింగ్ పై శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా పవర్ పాయింట్ ద్వారా చేపట్టే అంశాలను వివరించారు. రాష్ట్రంలోని 202 ప్రభుత్వ ఆసుపత్రులలో (31 GGHs, 9 స్పెషాలిటీ ఆసుపత్రులు (హైద్రాబాద్), వరంగల్ లోని 4 ఆసుపత్రులు ), తెలంగాణ వైద్య విధాన పరిషత్ లోనీ 100 పడకల పైన ఉన్న ఆస్పత్రుల (40) ను దశలవారీగా బ్రాండింగ్ చేయాలని మంత్రి వైద్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపీ, ఐపీ , సర్జరీలను పెంచడంతోపాటు, సామాన్యులకు ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యమైన , మెరుగైన వైద్య సేవలు అందిస్తారని భరోసా కల్పించడమే లక్ష్యం గా ఈ బ్రాండింగ్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజల అవసరాలకు అనుగుణంగా బెడ్ ల సామర్థ్యాన్ని పెంచడంతోపాటు, ఎక్విప్మెంట్ (సీటీ , ఎం ఆర్ ఐ ) లను సమకూర్చడం, బ్లడ్ బ్యాంకుల ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న బ్రాండింగ్ కార్యక్రమంలో భాగంగా ఎన్ ఎం వీ నిబంధనలకు అనుగుణంగా ఫైర్ సేఫ్టీ , ఎలక్ట్రికల్ సేఫ్టీ, డ్యూటీ రూమ్, సీసీటీవీల పర్యవేక్షణ, సెక్యూరిటీ అవుట్ పోస్టుల ఏర్పాటు, రెడ్ అలారం సిస్టం లను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పనలో భాగంగా ఐపి, ఓపీ విభాగాలకు వచ్చే పేషెంట్లకు టాయిలెట్ బ్లాక్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఆస్పత్రిలో స్ట్రక్చరల్ రిపేర్లు, వివిధ విభాగాలకు సంబంధించి ప్రత్యేక కౌంటర్లు, సైనేజ్ బోర్డులు, అంతర్గత రోడ్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఆస్పత్రిలో క్యాంటీన్, మంచినీటి సౌకర్యం, పేషంటు వెంట వచ్చే అటెండర్ల సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించాలన్నారు . ఆసుపత్రులలో ప్రత్యేకంగా రిసెప్షన్లు, కామన్ ఏరియా, బయో మెడికల్ వేస్టేజీ , ల్యాండ్ స్కేపింగ్ లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆస్పత్రులలో పరిపాలన విభాగాన్ని ఏర్పాటు చేసి కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల ను తీర్చిదిద్దాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు ను పరిశీలించి వచ్చిన వైద్యశాఖ అధికారులు ఆయా రాష్ట్రాలలో ఆసుపత్రుల పనితీరు నివేదికను మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి వివరించారు. తెలంగాణలో వైద్య సేవలు దేశంలో వివిధ రాష్ట్రాల కు ఆదర్శంగా నిలిచేలా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, ఎక్విప్మెంట్ లను ఆసుపత్రులకు సమకూర్చి వైద్య సేవల బలోపేతానికి నిర్దిష్టమైన విధానాలను రూపొందించి అమలు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు వెల్లడించారు. ఈ సమీక్షలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ, టీజీఎంసిడీసీ ఎండి ఫణీంద్ర రెడ్డి, డీఎంఈ డా. నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, స్పెషల్ డీఎంఏ డా. విమల థామస్, టీజీఎంసీడీఎంసీ సీఈ దేవేందర్ లు పాల్గొన్నారు.



# రేవంత్.. రాజీనామా చెయ్

- పాలన చేతకాకపోతే రాష్ట్రం పరువు తియ్యొద్దు
- ఆపద వచ్చినప్పుడు ప్లానింగ్, కమిట్‌మెంట్ ఉండాలి
- మీ వ్యాఖ్యలు ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ఉద్యమంలో తమ ఉద్యోగాలు పోయినా సరే తమకు స్వరాష్ట్రం కావాలని కొట్లాడిన కార్మికులు, ఉద్యోగులు ఇలాంటి బెదిరింపులకు లొంగరని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి పాలన చేతకాకపోతే రాజీనామా చేసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. మంగళవారం నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సమాజం ప్రేమకు తప్పితే బెదిరింపులకు భయపడదన్నారు. గతంలో ఎన్టీఆర్, కేసీఆర్ ఎస్మా ప్రయోగిస్తామంటే ఏం జరిగిందో తెలుసుకోవాలని సూచించారు. ఎన్టీఆర్, కేసీఆర్ హయాంలో ఉద్యోగులను విలన్ గా చూపెట్టే ప్రయత్నం చేశారని, అప్పుడు ఏం జరిగిందో కూడా అందరికీ తెలుసన్నారు. ఇటీవల సీఎం రేవంత్.. చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. తెలంగాణ ఎన్నడూ పేద రాష్ట్రం కాదని, కానీ కొందరు పేదరికంలో ఉంచారన్నారు. నిజాం కాలం నుండి నేటి వరకు అనేక వనరులు ఉన్న రాష్ట్రం తెలంగాణ అని ఈటల పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి కేవలం ఒక్క మనిషిని, ఒక పార్టీని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ దివాలా తీసిందని మాట్లాడుతున్నారని ఫైరయ్యారు. పదేండ్లలో రాష్ట్రం పీసీఐలో మొదటి స్థానంలో ఉందన్నారు. రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్రం ఎలా దివాలా తీసిందో చెప్పాలని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. 201415 లో రాష్ట్రానికి వచ్చిన టాక్స్ రూ.29,286 కోట్లని వివరించారు. కరోనా లాంటి సమయంలో రూ.66 వేల కోట్ల ట్యాక్స్ వచ్చిందన్నారు. 202425లో కూడా రూ.1.30 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. బ్యాంకర్లు రాష్ట్రానికి అప్పు ఇవ్వకపోతే రూ. 64 వేల కోట్ల ఎలా అప్పు చేశారో చెప్పే దమ్ము రేవంత్ రెడ్డికి ఉందా? ప్రశ్నించారు. రూ.18 లక్షల కోట్ల ఆదాయాన్ని సమకూర్చే రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి.. ఏవిధంగా దివాలా తీసిందని అంటున్నారని నిలదీశారు. ఉన్న స్కీములు కూడా ఇచ్చే దమ్ము లేక ఇలా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రేవంత్ రెడ్డి అసమర్థ సీఎం

## ఆయనకు పరిపాలన చేతకావడం లేదు

ఎన్నికలకు వెళ్తారా? అసెంబ్లీని రద్దు చేస్తారా?.. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు విమర్శలు



**ఢిల్లీ, మహా:** రేవంత్ రెడ్డి సర్కార్ చేతకాని ప్రభుత్వమని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందించిన ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వాని నడపడం చేతకాకపోతే ఎన్నికలకు వెళ్తారా అసెంబ్లీని రద్దు చేస్తారా రేవంత్ రెడ్డి నిర్ణయించుకోవాలని కామెంట్స్ చేశారు. రేవంత్ రెడ్డి అంత అసమర్థ సీఎంను ఎప్పుడు చూడలేదన్నారు. కేసీఆర్ లక్ష కోట్ల అవినీతి డబ్బుకు కక్కిస్తానని చెప్పిన రేవంత్.. ఇప్పుడెందుకు సైలెంట్ గా ఉన్నారని ప్రశ్నించారు. పరిపాలన చేతకాక రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి అలాంటి భాష మాట్లాడడం తగదని, అధికారంలోకి వచ్చాక రేవంత్ రూ. 1,50,000 కోట్లు అప్పు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి దేశ రక్షణ విషయంలో రాజీ పడే మాటలు మాట్లాడుతోందని, పాకిస్థాన్‌కు అనుకూలంగానే మాట్లాడుతుందని వ్యాఖ్యానించారు. ఉగ్ర దాడి మోడీకి ముందే తెలుసని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున మాట్లాడడం దౌర్భాగ్యమన్నారు. అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వానికి మద్దతంటునే బయటకు వచ్చి మోడీది తప్పని మాట్లాడుతారని తెలిపారు. తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని రక్షణశాఖ సహాయ మంత్రిని కలిసినట్లు వెల్లడించారు. తెలంగాణలో మూడు సైనిక్ స్కూల్స్ తీసుకొచ్చే బాధ్యత తనదేనని, రాష్ట్ర ప్రభుత్వం దీనికి సహకరించి భూమి ఇవ్వాలని కోరారు.

# నేడు సెక్యూరిటీ మాక్ డ్రిల్స్

### 54 ఏండ్ల తర్వాత నిర్వహణ.. హైదరాబాద్‌లో నాలుగు ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటలకు 259 చోట్ల మాక్ డ్రిల్స్



**హైదరాబాద్, మహా:** శత్రువుల నుంచి దాడులు ఎదురైన పక్షంలో పౌరులు సమర్థవంతంగా ఆత్మరక్షణ చేసుకునేందుకు పాటించాల్సిన అంశాలపై నేడు సెక్యూరిటీ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని ఆదేశించింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. కేంద్రం ఆదేశాలతో తెలుగు రాష్ట్రాలతోపాటు నేడు మొత్తం 259 చోట్ల మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో మొత్తం నాలుగు ప్రాంతాల్లో ఈ డ్రిల్స్ జరగనున్నాయి. కంచన్‌బాగ్ డీఆర్డీవో, మౌలాలి ఎన్ఎఫ్‌సీ, సికింద్రాబాద్, గోల్కొండలో సాయంత్రం 4 గంటలకు సెక్యూరిటీ మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మాక్‌డ్రిల్స్‌పై కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దాడులకు అవకాశం ఉన్న జిల్లాలను మూడు కేటగిరీలుగా విభజించారు. ప్రధాని నివాసం, త్రివిధ దళాల హెడ్ క్వార్టర్స్ ఉండడంతో కేటగిరి 1లో దేశ రాజధాని ఢిల్లీ, తారాపూర్ అణు కేంద్రం ఉన్నాయి. కేటగిరి 2లో తెలుగు రాష్ట్రాల్లోని విశాఖపట్నం, హైదరాబాద్‌లు ఉన్నాయి.

**54 ఏండ్ల తర్వాత..**

మెట్రోలు, రక్షణ సంస్థలు, కీలక ప్రాజెక్టుల రక్షణ పైన రేపు మాక్ డ్రిల్ జరగనుంది. ఈ మాక్ డ్రిల్స్‌లో అధికారులతో పాటు సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వాలంటీర్లు, హోంగార్డులు, ఎన్‌సీసీ/ ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్రాలు, కళాశాలలు/ పాఠశాలల విద్యార్థులను భాగస్వాముల్ని చేయనున్నారు. దేశంలో సెక్యూరిటీ మాక్‌డ్రిల్స్ నిర్వహణ కొత్తదేమీ కాదు. అదే సంవత్సరం 1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసమని భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగింది. ఇప్పుడు 54 ఏండ్ల తర్వాత మళ్లీ ప్రభుత్వం మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తున్నది.

# రేవంత్ ముక్కుసూటి మనిషి

## ఆ మాటలు సీఎం ఆవేదనగా భావించాలి

### ఉన్నది ఉన్నట్టు చెప్తారు.. అనవసర ఆరోపణలొద్దు
### ఎట్టి పరిస్థితుల్లో పథకాలు ఆపే ప్రసక్తే లేదు: మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఆయన విషయాలను ఉన్నది ఉన్నట్టుగా చెప్తారని, అందువల్ల ఆయనపై అనవసరమైన ఆరోపణలు చేయడం సరైంది కాదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. గత ప్రభుత్వ ఆర్థిక తప్పిదాలను సరిచేస్తున్నామని సీఎం చెప్పడం, రాష్ట్రానికి అవసరమైన మార్పులు తీసుకురావడంలో తీవ్రంగా కృషి చేస్తున్నారని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. బీజేపీ పార్టీకి పాలించే అర్హత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఏ వ్యవస్థను కూడా హ్యాండిల్ చేయని బీజేపీకి పాలించే అర్హత ఎక్కడిదన్నారు. మంత్రులు ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకి వెళ్లాలంటే, కారు కంటే హెలికాప్టర్ వాడడం ఖర్చు తక్కువ అవుతుందని తెలిపారు. హెలికాప్టర్ కొనుగోలు చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.

**ఎవరైనా నమ్ముతారా?**

తమకు ప్రభుత్వాన్ని నడిపే సత్తా ఉందో లేదో ప్రజలకి తెలుసని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇది, ప్రభుత్వానికి ఉన్న బాధ్యతలను, ఉద్యోగుల సంక్షేమాన్ని గుర్తు చేస్తుందన్నారు. అందాల పోటీల గురించి మాట్లాడుతూ ఇవి అందానికి సంబంధించినవి కాదన్నారు. వ్యక్తిత్వానికి సంబంధించినవని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరు తెచ్చే అందాల పోటీలను గౌరవంగా భావించడం, రాష్ట్రానికి ఉన్న ప్రత్యేకతను ప్రదర్శించడంలో సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ నేతలెప్పుడూ మాకు ప్రత్యర్థులేనని, కుల గణన, ఎస్సీ వర్గీకరణ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం చేయడం లేదంటే ఎవరైనా నమ్ముతారా అని ప్రశ్నించారు. దీంతోపాటు స్మితా సభర్వాల్‌పై తమకు ఎలాంటి కక్ష్య లేదన్నారు.

# సోలార్ విద్యుత్‌ను కుదించొద్దు

## 4 వేల మెగావాట్ల ఒప్పందాన్ని కొనసాగించాలి

కేంద్ర మంత్రికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి



**ఢిల్లీ, మహా:** ఢిల్లీలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. పీఎం కుసుమ్ పథకం కింద తెలంగాణతో కుదుర్చుకున్న 4 వేల మెగావాట్ల విద్యుత్ ఒప్పందాన్ని కొనసాగించాలని కోరారు. ఈ బేటీలో ప్రధానంగా సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను భట్టి విక్రమార్క కేంద్ర మంత్రికి వివరించారు. అందుకే సోలార్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సహకరించాలని, గతంలో కుదుర్చుకున్న 4 వేల మెగావాట్ల విద్యుత్ ఒప్పందాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఇరువురి సమావేశం అనంతరం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. సోలార్ పవర్ విషయంలో కేంద్రం నూతన పాలసీ తీసుకువచ్చాక తెలంగాణ ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. 4 వేల మెగావాట్లతో సోలార్ పవర్‌లో భాగంగా రైతులకు పెద్ద ఎత్తున సోలార్ పంపులు పెట్టించాలని రాష్ట్రం నిర్ణయించిందని చెప్పారు. అయితే, కేంద్రం ముందస్తుగా తెలంగాణతో కుదర్చుకున్న 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను వెయ్యి మెగావాట్ల కుదించినట్లు సమాచారం అందిందని, సోలార్ విద్యుత్‌ను కుదించొద్దని, గతంలో కుదర్చుకున్న ఒప్పందం ప్రకారం తెలంగాణకు సోలార్ విద్యుత్ కేటాయింపులు జరిగేలా చూడాలని కేంద్రాన్ని కోరినట్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# గచ్చిబౌలిలో విరుచుకుపడ్డ హైడ్రా

## సంధ్య కన్వెన్షన్ సెంటర్ నేలమట్టం

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నగరంలో హైడ్రా కూల్చివేతల పరంపర కొనసాగుతోంది. గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ ప్రాంతంలో ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లోని అక్రమ కట్టడాలను నేలమట్టం చేసింది. లేఅవుట్‌లో నివసిస్తున్న వారి ఫిర్యాదు మేరకు స్పందించిన హైడ్రా, మంగళవారం ఉదయం రెండు బుల్డోజర్లతో సంధ్య కన్వెన్షన్ సెంటర్‌పై విరుచుకుపడింది. సంధ్య కన్వెన్షన్ మినీ హాల్‌తో పాటు, వంటగదులు, రెస్ట్‌రూమ్‌లను కూల్చివేసింది.

**నిర్ధారించిన తర్వాతే కూల్చివేతలు**

లేఅవుట్‌ను ఆక్రమించి నిర్మించిన రేకుల ఫెన్సింగ్ తొలగించింది. జీప్లస్2గా నిర్మించిన 3 రేకుల షెడ్లను నేలమట్టం చేసింది. లేఅవుట్ నామరూపాలు లేకుండా రోడ్లు, పార్కులను కలుపుతూ ఆక్రమించారని, అందులో తమ ప్లాట్లు కనిపించకుండా నిర్మాణాలు చేపట్టారని ప్లాట్ యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అక్రమ నిర్మాణంగా నిర్ధారించి సంధ్య కన్వెన్షన్ సెంటర్ నిర్మించిన అనధికారిక కట్టడాలను హైడ్రా నేలమట్టం చేసింది.

**కూల్చివేతలపై వాగ్వాదం**

హైదరాబాద్ నగర శివారు రాజేంద్రనగర్ మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇందిరాగాంధీ సొసైటీ ప్రధాన రహదారిపై వెలసిన అక్రమ ప్రహరీ గోడలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. కబ్జాదారులకి, హైడ్రా అధికారుల మధ్య వాగ్వావాదం జరిగింది. కొంతమంది కబ్జాదారులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో హైడ్రా అధికారులు కేసు నమోదు చేశారు. ఇందిరాగాంధీ సొసైటీ 50 సంవత్సరాల క్రితం ఏర్పడింది. దాంట్లో మొత్తం వందల ప్లాట్లు ఏర్పాటు చేశారు. గత 50 సంవత్సరాల నుంచి కూడా వివాదంగా మారిన రహదారికి హైడ్రా కూల్చివేతలతో విముక్తి కలిగింది. ఐదు సంవత్సరాల నుంచి ఈ వెంచర్‌లో ప్లాట్ల యజమానులు ఇంటి నిర్మాణాలు చేపట్టారో అప్పటి నుంచి దారిలేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.



## సీఎంతో స్విట్జర్లాండ్ రాయబారి భేటీ

ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని స్విట్జర్లాండ్ రాయబారి మాయా తిస్సాఫీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్విట్జర్లాండ్–తెలంగాణ మధ్య స్నేహపూర్వక భాగస్వామ్యం, పారిశ్రామిక సహకారం, పెట్టుబడి అవకాశాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చలు జరిగాయి.

- మహా, హైదరాబాద్

# శ్రీ రంగాపూర్ లో రక్షిత మంచినీటి పథకం ప్రారంభం

## హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిలు



**షాద్ నగర్,మహా:** దాతల సహకారం తో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రక్షిత మంచినీటి సరఫరా కార్యక్రమాన్ని షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలం శ్రీరంగాపూర్ లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతులమీదుగా ప్రారంభించారు. మంచినీటి పథకం దాతలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్, కొందుర్గు మండలం సింగల్ విండో డైరెక్టర్ బిమిడి అశోక్ రెడ్డి అధ్వర్యంలో 6 లక్షల 30 వేలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరై రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. డిజిటల్ కార్డుతో నడిచే ఈ మంచినీటి పథకాన్ని చూసి కలెక్టర్ నారాయణ రెడ్డి దాతలను అభినందించారు. ఈ కార్యక్రమం లో ఆర్డిఓ సరిత, తహసీల్దార్ రమేష్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం రెడ్డి, మాజీ సర్పంచ్ జంగయ్య, ఉప సర్పంచ్ రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి, పత్తి బాలరాజు, రవీందర్ యాదవ్, గోపాల్ గౌడ్, ప్రభాకర్, ఇస్మాయిల్, పత్తి రమేష్, కురువ రవి, ఖాజా, వెంకటేష్ గౌడ్, శ్రీశైలం గౌడ్ గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# ప్రేమ వేధింపులకు మైనర్ ఆత్మహత్య

### ఇంస్టాగ్రామ్ లో వేధింపులు... మందలించిన మారని బాలుడు
### హయత్ నగర్ లోని రంగనాయకుల గుట్టలో విషాదం



**ఎల్బీనగర్,మహా :** హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణమైన సంఘటన చోటుచేసుకుంది. రంగనాయకుల గుట్టకు చెందిన మీనాక్షి అనే (13) మైనర్ మంగళవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు... కనుగూరి విజయ్, తిరుపతమ్మ దంపతులకు ఇద్దరు అమ్మాయిలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరి చిన్న కుమార్తె మీనాక్షి ఇటీవల 9వ తరగతి పూర్తి చేసింది. స్థానికంగా ఉంటున్న పానుగోటి రోహిత్ అనే యువకుడు ఇటీవల ఇంటర్ పూర్తి చేశాడని, ప్రేమ పేరుతో ప్రతి రోజూ మీనాక్షిని వేధిస్తున్నాడు. రోహిత్ తన తమ్ముడు నూతన్ కుమార్ సోషల్ మీడియా ఇన్స్టాగ్రామ్ అకౌంట్ నుంచి మీనాక్షికి అసభ్యకరమైన మెసేజ్‌లు పంపినట్లు యువతి తండ్రి విజయ్ తెలిపాడు. రోహిత్ పై చర్యలు తీసుకోవాలని మీనాక్షి కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, సోమవారం బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో రోహిత్ అక్కడికి వచ్చి మీనాక్షిని బెదిరించాడని, దీంతో మనస్తాపానికి గురైన మీనాక్షి ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోకపోవడంతో రోహిత్ తిరిగి బెదిరించడంతో మీనాక్షి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని మీనాక్షి కుటుంబ సభ్యులు, బంధువులు హయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హయత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గోపనపల్లిలో ఐటీ పార్క్

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. కంచ గచ్చిబౌలి భూముల్లో ఐటీ పార్కు వివాదాస్పదం కావడంతో ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టింది. ఐటీ పార్క్ కోసం శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలో భూసేకరణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పారిశ్రామిక మౌలికవసతుల కల్పన సంస్థ ఏర్పాటు చేసే ఐటీ పార్కు నిర్మించనుంది. దీంతోపాటు ఇతర పార్కుల కోసం భూసేకరణ చేయాలని చూస్తోంది. ఇందులో భాగంగానే రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు భూసేకరణ ప్రక్రియ మొదలుపెట్టినట్లు సమాచారం. పలు సర్వే నంబర్లను రెవెన్యూ రికార్డుల్లో నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శేరిలింగంపల్లి ఆర్డీవోకు రాసిన లేఖలో పేర్కొన్నారు. దీంతో గోపన్‌పల్లిలోని సర్వే నంబర్ 127, 173, 263, 286 సర్వే నంబర్ల పరిధిలోవున్న 439.15 ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారు. మరికొన్ని రోజుల్లో భూసేకరణకు నోటిఫికేషన్ కూడా విడుదలకానున్నట్లు సమాచారం. ఇటీవల ఆ 400 ఎకరాల భూమి వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. దీంతో జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం ఈ కేసును సుమోటోగా తీసుకొని అక్కడి కార్యకలాపాలపై స్టే విధించింది. ఈ వ్యవహారంపై 5 ప్రశ్నలు సంధిస్తూ.. ఏప్రిల్ 16లోపు అఫిడవిట్ దాఖలు చేయాలంటూ ఆదేశించింది. కంచగచ్చిబౌలిలో 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని తెలంగాణ సర్కార్ సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తెలిపింది. ఈ భూమి ఎప్పుడూ కూడా అటవీ రికార్డుల్లో లేదని చెప్పింది.

EDITORIAL సంపాదకీయం

# అసమాన్య సాహితీవేత్త, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్

## (మే 7 రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా)

రవీంద్రనాథ్ ఠాగూర్ 7 మే, 1861వ సంవత్సరంలో కలకత్తాలో జన్మించారు. ఆయన తండ్రి దేవేంద్రనాథ్ టాగూర్.తల్లి శారదాదేవి. రవీంద్రునిది బహుముఖ ప్రతిభ. వీరు గత శతాబ్దపు భారత సామాజిక, ధార్మిక,ఆధ్యాత్మిక పునరుజ్జీవన కాల ఖండంలో దీప స్తంభంగా నిలిచారు. వారి సాహిత్యం, ఆలోచనలు భారతీయ సనాతన, శాశ్వత విలువల ఆధారంగా నిలిచాయి.వేదం, ఉపనిషత్తుల తత్త్వం ఆధారంగా ఆయన 1912 లో 'గీతాంజలి' రచించారు. 1913 లో దానికి నోబెల్ పురస్కారం లభించింది. ఈ బహుమతి పొందిన మొదటి భారతీయుడు ఆయనే. జలియన్ వాలాబాగ్ హత్యాకాండకు నిరసనగా బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన నైట్ హుడ్ బిరుదును ఆయన తిరిగి ఇచ్చేశారు. స్వాతంత్రం పొందిన తర్వాత వారు రచించిన జనగణమన గేయాన్ని మన జాతీయగీతంగా స్వీకరించాం. మతం ఆధారంగా ప్రత్యేక నియోజకవర్గాల ఏర్పాటు విధానాన్ని రవీంద్రనాథ్ టాగూర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆచార్య జగదీశ్ చంద్రబోస్ విదేశీ పర్యటన నిమిత్తం ధనసేకరణకై రవీంద్రుడు త్రిపుర మహారాజుతో సహా అనేక మందిని కలిశారు. వీరి ఆలోచన, ఆచరణ ఒకే దారిలో సాగాయి. మహాత్మా గాంధీతో సహా అప్పటి జాతీయ నాయకులు తమకు ప్రేరణ గురుదేవ రవీంద్రుడేనని చెప్పారు. మహాత్మా గాంధీయే మొదటిసారి వారిని 'గురుదేవుడి' గా సంబోదించారు.

### నవల, నాటకాలు..

గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయమని రవీంద్రుడు భావించాడు. అందుకై శ్రీ నికేతాన్ని నెలకొల్పి, గ్రామ పునర్నిర్మాణానికి ఎంతో కృషి చేసేవాడు. రవీంద్రుడు మొదట 'వాల్మీకి ప్రతిభ' అనే నాటకాన్ని రచించాడు. ఆ తరువాత అమల్ అనే పిల్లవాణ్ణి గురించి 'పోస్టాఫీసు' అనే నాటకం వ్రాశాడు. రవీంద్రుడు రచించిన 'చిత్రాంగద నాటకం' ఆయనకు మంచిపేరు తెచ్చింది. 'ప్రకృతి ప్రతీక' అనే నాటకంలో ప్రపంచాన్ని విడిచి పెట్టిన సన్యాసి కథను వర్ణించాడు. రవీంద్రుడు కచదేవయాని, విసర్జన, శరదోత్సవ్, ముక్తధార, నటిర్‌పూజ మొదలగు అనేక శ్రేష్ఠమయిన నాటకాలు రచించాడు.

### చిత్రకళ, సంగీతం..

రవీంద్రుడు డెబ్బై ఏళ్ళ ప్రాయంలో చిత్రకళా సాధనను ప్రారంభించాడు. ఆయన వేసిన చిత్రాలు లండన్,ప్యారిస్, న్యూయార్కు మొదలగు నగరాలలో ప్రదర్శించబడ్డాయి. ఆయన దాదాపు రెండు వేల చిత్రాలను గీశాడు.

### శాంతి నికేతన్..


రవీంద్రుడు కేవలం రచయితగానే ఉండిపోక, బాలల హృదయాలను వికసింపచేయటానికై ప్రాచీన మునుల గురుకులాల తరహాలోనే శాంతినికేతన్‌గా ప్రసిద్ధి గాంచిన విశ్వభారతి విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు.అది అయిదుగురు విద్యార్థులతో మొదలై, క్రమంగా విస్తరించింది. చిన్న పిల్లలు ఉపాధ్యాయుల ఇళ్ళల్లో భోజనం చేసేవారు. ప్రాతఃకాలానే నిద్ర లేవడం, కాలకృత్యాలు తీర్చుకొని, తమ గదులను తామే శుభ్రపరచు కొని స్నానం చేయడం, ప్రార్థన చేయటం, నియమిత వేళలలో నిద్ర పోవటం వారి దినచర్య. ఆరోగ్యం కాపాడుకోవటం, పరిశుభ్రత, సత్యాన్నే పలుకుట, కాలినడక, పెద్దలను, గురువులను గౌరవించటం వారికి నేర్పేవారు.

### గీతాంజలి..

రవీంద్రుని రచనలలో గీతాంజలి చాల గొప్పది. రవీంద్రుడు తాను బెంగాలీ భాషలో రచించిన భక్తిగీతాలను కొన్నింటిని ఆంగ్లంలో నికి అనువదించి 'గీతాంజలి అనిపేరు పెట్టాడు. అది అనేక ప్రపంచ భాషలలోనికి అనువదించ బడింది. ప్రపంచ సాహిత్యంలో ఇది గొప్ప రచన. మానవుని కృంగదీసే నిరాశా నిస్పృహలను, సకల సృష్టిని ప్రేమభావంతో చూచి శ్రమ యొక్క గొప్పతనాన్ని సూచించే మహత్తర సందేశం గీతాంజలిలోని ముఖ్యాంశం.

### స్వాతంత్ర్య సాధన,జనగణమన..

రవీంద్రుడు మొదటి నుండి జాతీయ భావాలున్నవాడు. హిందూ మేళాలో దేశభక్తి గీతాలను పాడాడు. పృథ్వీరాజు పరాజయం గురించి ప్రబోధాత్మక పద్యనాటకాన్ని రచించాడు. బ్రిటీష్ ప్రభుత్వం తిలక్‌ను నిర్బంధించినపుడు రవీంద్రుడు తీవ్రంగా విమర్శించాడు. బెంగాల్ విభజన ప్రతిఘట నోద్యమంలో రవీంద్రుడు ప్రముఖ పాత్ర వహించాడు. జాతీయ నిధికి విరాళాలు వసూలు చేశాడు. టాగోర్ 1896లో జరిగిన కలకత్తా కాంగ్రెస్ సదస్సులో మొట్టమొదటిగా బంకించంద్ర చటర్జీ రచించినవందేమాతరాన్ని ఆలపించాడు.రవీంద్రుడువ్రాసిన జనగణమణ ను జాతీయ గీతంగా ప్రకటించేముందు "వందేమాతరం", "జనగణమన" లపై దేనిని జాతీయ గీతంగా ప్రకటించాలని సుదీర్ఘ చర్చ, తర్జన భర్జనలు జరిగాయి. అంతిమంగా రవీంద్రుడి 'జనగణమన' దే పైచేయి అయింది. దీంతో రాజ్యాంగ సభ కమిటీ అధ్యక్షుడు బాబూ రాజేంద్ర ప్రసాద్ 1950 జనవరి 24న జనగణమనను జాతీయ గీతంగా, వందేమాతరంను జాతీయ గేయంగా ప్రకటించాడు. అదే సమయంలో




రెండూ సమాన ప్రతిపత్తి కలిగి ఉంటాయని స్పష్టం చేసాడు.రచయితగా, సంగీతవేత్తగా, చిత్రకారునిగా, విద్యావేత్తగా గొప్ప మానవతావేత్తగా టాగూర్ చరిత్రలో నిలిచిపోయాడు. మాతృభూమి, మానవ సంబంధాల పట్ల అచంచలమయిన నమ్మకం, ప్రేమాభిమానాలు కలిగి ఉన్న విశ్వకవి' రవీంద్రనాథ్ టాగూర్, 1941 ఆగష్టు 7న మరణించాడు.



- పిన్నింటి బాలాజీ రావు
భౌతికరసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు
9866776286

# కళ్ళ కింద నల్లటి వలయాలు పోవాలంటే

**డార్క్ సర్కిల్స్ పోగొట్టుకోడానికి రకరకాల క్రీమ్ లు, క్లీన్సర్ లు అందుబాటులో ఉన్నాయి. కానీ..వాటి వల్ల కొన్ని సార్లు సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే ప్రమాదముంది. అలా కాకుండా సహజ సిద్ధంగా తయారు చేసిన పదార్థాలతో ఈ నల్లటి వలయాలను పోగొట్టుకోవచ్చని చెబుతోంది ఆయుర్వేదం.**



రకరకాల టెన్షన్లు. నిద్రలేమి. రాత్రంతా కూర్చుని సినిమాలు చూసే అలవాటు. ఇలా కారణం ఏదైనా కావచ్చు. కంటి ఆరోగ్యం దెబ్బ తింటోంది. దీంతో పాటు అందంగా మెరవాల్సిన ముఖం కూడా చాలా నీరసంగా మారిపోతోంది. ముఖ్యంగా కళ్ల కింద డార్క్ సర్కిల్స్ వస్తున్నాయి. ఒక్కసారి వచ్చాయంటే అవి అలా స్ప్రెడ్ అవుతూ ఉంటాయి. చిన్న వయసులోనే ముసలి వాళ్లు అయిపోయిన ఫీలింగ్ వచ్చేస్తుంది. వీటికి తోడు అవి ఎక్కువైతే కళ్ల కింద ముడతలు కూడా పడతాయి. అద్దంలో చూసుకున్న ప్రతిసారీ ఇబ్బందిగా అనిపిస్తుంది. అయితే..ఈ డార్క్ సర్కిల్స్ పోగొట్టుకోడానికి రకరకాల క్రీమ్ లు, క్లీన్సర్ లు అందుబాటులో ఉన్నాయి. కానీ..వాటి వల్ల కొన్ని సార్లు సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే ప్రమాదముంది. అలా కాకుండా సహజ సిద్ధంగా తయారు చేసిన పదార్థాలతో ఈ నల్లటి వలయాలను పోగొట్టుకోవచ్చని చెబుతోంది ఆయుర్వేదం. ఇది డార్క్ సర్కిల్స్ ని పోగొట్టడంతో పాటు చర్మ ఆరోగ్యాన్నికూడా కాపాడుతుంది. ఆయుర్వేద షాప్స్ లో దొరికే రెండు మూడు పదార్థాలతోనే ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని ఔషధాన్ని తయారు చేసుకోవచ్చు.

### కావాల్సిన పదార్థాలు

ఈ నేచురల్ మెడిసిన్ తయారు చేసుకోడానికి రెండే రెండు పదార్థాలు అవసరం అవుతాయి. ఒకటి కోల్డ్ ప్రెస్డ్ ఆల్మండ్ ఆయిల్. అంటే రూమ్ టెంపరేచర్ వద్ద ఉంచి బాదం నుంచి నూనెని తయారు చేస్తారు. ఇందులో యాసిడ్ వాల్యూ చాలా తక్కువగా ఉంటుంది. సాధారణంగా నూనె ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉండాలని అందులో రకరకాల ప్రిజర్వేటివ్స్ కలుపుతారు. కానీ..ఈ కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ లో అలాంటివి ఏమీ ఉండవు. ఈ బాదం నూనె జుట్టు, చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది. దీన్ని ఫేషియల్ క్లీనర్ గానూ వాడతారు. జుట్టు మృదువుగా ఉండాలనుకునే వాళ్లూ ఈ ఆల్మండ్ ఆయిల్ ని వాడొచ్చు. ఆయుర్వేదిక్ స్టోర్స్ లో ఇది అందుబాటులో ఉంటుంది.

### ములేతి పౌడర్

ఈ మెడిసిన్ తయారు చేయడానికి ఆల్మండ్ ఆయిల్ తో పాటు ములేతి పౌడర్ కూడా కావాలి. ఇది కూడా ఆయుర్వేదిక్ స్టోర్స్ లో అందుబాటులో ఉంటుంది. దీన్ని లికోరిస్ పౌడర్ అని కూడా అంటారు. ఇది చర్మ ఆరోగ్యాన్ని కాపాడడంలో చాలా బాగా పని చేస్తుంది. ముఖ్యంగా యాక్నే సమస్యలతో ఇబ్బంది పడే వాళ్లు రెగ్యులర్ గా వాడుకోవచ్చు. చర్మాన్ని ఎప్పుడూ హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. మోకాళ్ల నొప్పులు, జలుబు, దగ్గు లాంటి సమస్యలకీ దీన్ని వాడతారు. అయితే ఒక్కో అనారోగ్యానికి ఒక్కో విధంగా దీన్ని తీసుకోవాల్సి ఉంటుంది.

### ఎలా తయారు చేసుకోవాలి

ములేతి పౌడర్ నేరుగా దొరుకుతుంది. అలా కాకుండా మూలికల రూపంలో దొరికితే దాన్ని పొడి చేసుకోవాలి. ఓ గ్లాసులో 10 ml మేర కోల్డ్ ప్రెస్డ్ ఆల్మండ్ ఆయిల్ తీసుకోవాలి. ఆ తరవాత నాలుగు గ్రాముల ములేతి పౌడర్ ని ఈ నూనెలో కలపాలి. ఇది బాగా కలిసేంత వరకూ మిక్స్ చేయాలి. అదే గ్లాసులో ఉంచి పైన మూత పెట్టాలి. అయితే.. ఇది వెంటనే వాడితే పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చు. అందుకే కనీసం 30 రోజుల పాటు ఈ మిశ్రమానికి ఎండ తగిలేలా ఉంచాలి. సూర్య రశ్మి ఎక్కువ ఎక్కడ ఉందో చూసి అక్కడే పెట్టాలి. ఎండ తగలడం వల్ల ఈ మెడిసిన్ ఇంకా బాగా పని చేస్తుంది.

### 30 రోజుల తరవాత

30 రోజుల పాటు దీన్ని నిల్వ ఉంచిన తరవాత ఓ చిన్న గ్లాస్ జార్ లోకి ఈ మిశ్రమాన్ని పోయాలి. అప్పటికి ఇది వాడేందుకు సిద్ధమైనట్టు లెక్క. అయితే రోజూ కనీసం రెండు సార్లు కళ్ల కింద ఈ మిశ్రమాన్ని అప్లై చేయాలి. అప్పుడే మంచి ఫలితాలు కనిపిస్తాయి. కేవలం అప్లై చేసి వదిలేయడం కాకుండా ఈ మిశ్రమాన్ని కళ్ల కింద రాసుకుని బాగా మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల చర్మంలోకి ఇంకుతుంది.

### ప్రయోజనాలివే

కోల్డ్ ప్రెస్డ్ ఆల్మండ్ ఆయిల్ చర్మాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. పొడిబారకుండా కాపాడుతుంది. చర్మం హైడ్రేట్ అవడం వల్ల నల్లటి వలయాలు క్రమంగా తగ్గిపోతాయి. ముడతలూ తగ్గుతాయి. చర్మాన్ని చల్లబరుస్తుంది. రక్త ప్రసరణ కూడా మెరుగవుతుంది. యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉండడం వల్ల ఇది శరీరానికీ చలువ చేస్తుంది. అయితే..ఈ మిశ్రమాన్ని వాడేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. డ్రై లికోరిక్ పౌడర్ ని మాత్రమే వాడాలి. ఇక ఈ మిశ్రమాన్ని తీసిన గ్లాస్ జార్ మూత సరైన విధంగా ఉండేలా చూసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ఇది పాడైపోయే అవకాశముంటుంది. ఒకేసారి మొత్తంగా అప్లై చేయకుండా ముందు కొంత రాయాలి. ఎలాంటి ఇబ్బంది లేదు అనిపించిన తరవాత దాన్ని కంటిన్యూ చేయాలి.

# పాక్ పై దాడి చేయకుండా ఇరాన్ దౌత్యం




ఇరాన్ పశ్చిమ ఆసియాలో ఉన్న దేశం. దీనిని మునుపు పర్షియా అని పిలిచేవారు. ఇరాన్ లో 1979లో రాజరికం రద్దు అయింది. రాజధాని టెహరాన్. కరెన్సీ రియాల్, భాష పర్షియన్, మతం ఇస్లాం. ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇవేకాక వరి, గోధుమ, పండ్లు, పంచదార ముఖ్య పంటలు. ఇరాన్ పెట్రోల్ ఉత్పత్తి చేసే ప్రధాన దేశం. ఇరాన్ లో తివాచీలు ప్రపంచ ప్రసిద్ధి పొందినవి. తివాచీ ల ద్వారా గణనీయ ఆదాయం వస్తోంది. రంగు, రంగుల తివాచీలు ఇరాన్ లో లభ్యం. ఇటీవల పహల్గం ఉద్రిక్తతలు పాక్, భారత్ ల మధ్య ఏర్పడిన దరిమిల ఇరాన్ సయోధ్యకు నడుం బిగించింది. స్వతహగ పాక్ కు మిత్ర దేశామైన భారత్ తో కూడా ఇరాన్ కు మంచి సంబంధాలు ఉన్నాయి. భారత్ చర్యతో పాక్ ఉక్కిరి, బిక్కిరి అవుతున్న తరుణం లో రెండిటి మధ్య రాజీకి ఇరాన్ సయోధ్య ప్రాధాన్యత సంతరించుకుంది. భారత్ దాడి చేయకుండానే పాక్ ను నిలువ రించింది. ఇటలీ లో ఆసియా డెవలప్మెంట్ బ్యాంకు సమావేశం లో ఆ బ్యాంకు చీఫ్ తో భారత ఆర్థిక మంత్రి నిర్మల సీతా రామన్ భేటీ కావడం, పాక్ నిధులు ఇవ్వకుండ స్తంబింప చేయడంలో భారత్ విజయం సాధించింది. పాక్ కు ఎక్కువ నిధులు ఆసియా డెవలప్మెంట్ బ్యాంకు నుంచి వస్తాయి. భారత్ చర్యతో పాక్ కు నిధులు ఆగిపోయాయి. దీనితో దాదాపు పాక్ కు గడ్డు కాలం దాపురించింది. ఒక్క తూట పేలకుండానే భారత్, పాక్ ను అడ్డుకుంది. దీనితో పాక్ పరిస్థితి దిగజారిపోయింది.అందుకేనేమో భారత్ తో సయోధ్యకు ఇరాన్ ను దించిందనే అనుమానాలు రెక్కేత్తిస్తున్నాయి. దానికి తోడు ఇరాన్, పాక్ లో తమకు మిత్రులు ఉన్నారని, వారితో సంభాషించి రెండు దేశాల మధ్య సంయమనం కు కృషి చేస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరా గ్చి చెప్పడం గమనార్హం. పాక్ అధ్యక్ష, ప్రధాని, విదేశాంగ మంత్రులతో భేటీ అయి భారత్ తో సయోధ్యకు తన వంతు కృషి చేస్తానని, ఉగ్ర వాదం ఎన్నటికీ మంచిది కాదని నొక్కి చెప్పారు. పాక్, ఇరాన్ మధ్య సంబంధాలు సమీక్షించు కుంటామని అందుకు ఇస్లామా బాద్ లో చర్చలకు శ్రీ కారం చుడతామని అబ్బాస్ చెప్పారు. రెండు దేశాలు సయోధ్యతోనే అభివృద్ధి సాధ్యమని అందుకు మే నెల 7,8 తేదీలలో భారత్ కు వస్తున్నారు. పాకే, భారత్ తో సయోధ్యకు కృషి చేయమని ఇరాన్ ను పుసి గొల్పిందని ఓ భోగట్టా. కాని భారత్ మాత్రం పాక్ ను తొక్కాలనే ఉద్దేశం తోనే ఉంది. అందుకే పాక్ కు ఎక్కువ నిధులు ఇస్తున్న ఆసియా డెవలప్మెంట్ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ ) నుంచి పాక్ కు నిధులు రావడం దాదాపు మృగ్యం. ఇప్పటికైనా పాక్ దారిలోకి వస్తే సరి, లేకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు. భారత్ చేసి చూపిస్తుంది. అంతే కాని పాక్ మాదిరి బెదిరింపులు, తాటాకు చప్పట్లకు ఏ మాత్రం కలత చెందదు. పాక్ కు ఇరాన్ మిత్ర దేశం అయినా పహల్గం దాడి సహించడం లేదు. పాక్ పై చర్యలకు భారత్ సమాయత్తమైన వేళ భారత్ ను మిత్రత్వం తో పాక్ పై దాడి చేయకుండా రాజీ చేయాలనే ఇరాన్ ఆకాంక్ష గా తోస్తోంది. భారత్, పాక్ పై దాడి చెస్తే మాత్రం పాక్ మిగలదు అనే విషయం ఇరాన్ కు తెలుసు. మరి ఇరాన్ దౌత్యం ఏ మేరకు సత్ఫలితాలు ఇస్తుందో చూడాలి.

- కనుమ ఎల్లారెడ్డి, 93915 23027

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# ఐరాసలో పాకిస్థాన్‌కు షాక్



పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల పై ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో అంతర్గత చర్చ జరిగింది. అయితే ఇందులో పాక్‌కు సభ్యదేశాలు కఠిన ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. పహల్గాం ఉగ్రదాడిని దృష్టి మళ్లించేందుకు పాకిస్థాన్ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించగా భారత్ గట్టిగా బదులిచ్చింది. సభ్య దేశాలు కూడా పహల్గాం ఉగ్ర దాడిని ముక్తకఠంతో ఖండించాయి. ఉగ్రదాడికి బాధ్యత ఎవరు వహిస్తారని సభ్య దేశాలు పాక్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే ఉద్రిక్తతలు పెరిగేలా పాకిస్థాన్ వరుసగా క్షిపణి పరీక్షలు నిర్వహించడంపైనా నిలదీశారు. ఐరాస సెక్యూరిటీ కౌన్సిల్‌లోని 15 సభ్య దేశాల్లో పాకిస్థాన్ ఒకటి. ఆ దేశం అభ్యర్థన పైనే ఈ సమావేశం జరిగింది. తన సభ్యత్వాన్ని అడ్డంపెట్టుకొని భారత్ వ్యతిరేక తీర్మానం చేయాలని తొలుత భావించింది. కానీ, ఈ ప్రయత్నాలు బెడిసికొట్టి దానికే ఎదురు క్లాస్ తీసుకొన్నాయి. దాదాపు గంటన్నర జరిగిన ఈ సమావేశం ఎలాంటి నిర్ణయం, తీర్మానాలు లేకుండానే ముగిసింది. ఐక్యరాజ్యసమితి కూడా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇరుదేశాలు చర్చల ద్వారా శాంతియుత పరిష్కారం తీసుకురావాలని భద్రతా మండలి సభ్య దేశాలు పిలుపునిచ్చాయని ఐరాస ప్రతినిధి మహమ్మది ఖిలారీ వెల్లడించారు. బహిరంగంగా అణు బెదిరింపులకు దిగుతున్న పాకిస్థాన్‌పై చాలా సభ్యదేశాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఇటీవల పాకిస్థాన్ క్షిపణి పరీక్షలు నిర్వహించడాన్ని కూడా ప్రశ్నించాయి. అది ఉద్రిక్తతలు పెంచి ప్రాంతీయ అస్థిరతకు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి. అదే సమయంలో భారత్ కుట్రపన్ని పహల్గాం తనకు తానే దాడి చేసుకొని (ఫాల్స్‌ఫ్లాగ్ ఆపరేషన్) పాక్‌పై నిందలు మోపుతోందన్న వాదనలను కూడా సభ్యదేశాలు తోసిపుచ్చాయి. ఉగ్రదాడికి పాల్పడిన వారు జవాబుదారీగా ఉండాలంటూ తేల్చి చెప్పాయి. పహల్గాం దాడిలో లష్కరే తోయిబా పాత్రను కూడా ఐరాస భద్రత మండలి సభ్య దేశాలు ప్రశ్నించాయి. అంతేకాకుండా ఉగ్రవాదులు మతం ఆధారంగా అమాయ ప్రజలను చంపడంపై ఆందోళన వ్యక్తం చేశాయి.

### పాక్ మేకపోతు గాంభీర్యం

అయితే పాకిస్థాన్ ఈ అంశాన్ని అంతర్జాతీయం చేద్దామనుకొంది. అయినా ఏ దేశమూ దానితో చేయి కలపలేదు. దీంతో ఏ తీర్మానం లేకుండానే సమావేశం ముగిసింది. చివరికి చైనా కూడా భేటీ అనంతరం ప్రెస్ స్టేట్‌మెంట్‌లో పాలుపంచుకోలేదు. భారత్‌తో ద్వైపాక్షిక చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని పాక్‌కు చాలా దేశాలు సలహా ఇచ్చాయి. పాక్ తరఫున ఐరాస శాశ్వత ప్రతినిధి అసీమ్ ఇఫ్తికార్ అహ్మద్ హాజరయ్యారు. భద్రతా మండలి సభ్య దేశాల నుంచి కఠిన ప్రశ్నలు ఎదుర్కొన్న పాకిస్థాన్ ప్రతినిధి ఇఫ్తికార్ మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. సమావేశంలో తమ లక్ష్యాలు నెరవేరాయని చెప్పారు.

# బాలాపూర్ అక్రమం గా అధికారికంగా 6 వేల మంది రోహింగ్యాలు

అనధికారికంగా ఎంతోమంది అడ్డదారుల లో భారత గుర్తింపు కార్డును పొందుతున్న వైనం
వీరిని వెనక్కి పంపాలని డిమాండ్



**బాలాపూర్ మహా:** 2012 జూలై లో బర్మా దేశంలో జరిగిన అల్లర్ల కారణంగా మొదట 210 మంది బాలాపూర్ రాయల్ కాలనీ,హఫీజ్ బాబా నగర్ కి వచ్చి తలదాచుకు న్నారు. ఈ సమయం లోనే (UNHRC) యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రిఫ్యూజెస్) శరణార్థులుగా కార్డులు కూడా పొందారు. కాల క్రమేణా మరికొంత మంది రావడంతో వీరి సం ఖ్య ఇప్పుడు గణనీయంగా పెరిగింది. పోలీసుల రికార్డుల ప్రకారం ప్రకారం బాలాపూర్ పరిధి లోని 27 క్యాంపులలో సుమారు ఆరు వేల మంది వరకు నివాసం ఉంటున్నారు. వీరికి సంబంధించిన అన్ని రకాల నమూనాలు పోలీసులు ఇప్పటికే సేకరించారు. పాకిస్తాన్ పౌరులను ఆ దేశానికి తిరిగి పంపాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యం లో అందరి దృష్టి మయన్మార్ (బర్మా) దేశానికి చెందిన రోహింగ్యా ముస్లింల పై పడింది. పహల్గాంలో పర్యాటకుల పై ఉగ్ర దాడుల నేపథ్యంలో పాక్ అక్రమ వలసదారుల పై భారత్ అప్రమత్తమైంది. రోహింగ్యాల శరణార్థుల ముసుగేసుకుని నగర శివారు లోని బాలాపూర్, పహాడీషరీఫ్,జల్ పల్లి,కాంచన్ భాగ్ తదితర ప్రాంతాలకు పలువురు వచ్చిచేరారు. కాల క్రమేణా వేలాదిగా అక్ర మార్గం లో వచ్చి స్థిరపడ్డారు. కొందరు ఏకంగా భారత పౌరసత్వ కార్డులు కూడా పొందారు. బాలాపూర్ రాయల్ కాలనీలోని వీరి క్యాంప్ లో తలదాచుకున్న ఓ ఉగ్రవాదిని సైతం గతంలో ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. దేశ భద్రతకు ముప్పువాటిల్లే పరిస్థితి ఉన్న నేపథ్యాన్ని వివరిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం బాలాపూర్ తహసీల్దార్,బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ కి రోహింగ్యాల విషయమై వినతిపత్రాలు అందజేశారు. 2014 నవంబర్ లో శరణార్థుల ముసుగులో ఉన్న ఖాలేద్ మహ్మద్ అనే వ్యక్తిని ఉగ్రవాద సంబంధాల అనుమానంతో రాయల్ కాలనీ నుంచి ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. ఇదే విషయం పై ఈరోజు భారతీయ జనతా పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యం లో రోహింగ్యాలు అక్రమంగా నివసించే ప్రాంతాన్ని పరిశీలించి అనంతరం బాలాపూర్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోహింగ్యాలను దాదాపు అనధికారికంగా 30,000 మంది ఉన్నారని మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా వీరి సంఖ్య ఎక్కువగా ఉంటుందని వారికి ఇక్కడున్న వారే షెల్టర్ ఇస్తున్నారని అయినా ఆరోపించారు. అక్రమంగా ఉంటున్న వారికి వాహనాలు ,రేషన్ కార్డులు,ఆధార్ కార్డులు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. హైదరాబాద్ ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ,స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దీని పై ఎందుకు స్పందించడం లేదు అని ఆరోపించిన బీజెపి నాయకులు,ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం,తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ,బాలాపూర్ ఎమ్మార్వో, వెంటనే విచారణ జరిపి 15 రోజుల్లోపు వారిని గుర్తించి ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మేమే వారిని తరిమి కొడతామన్నారు. ఈ కార్యక్రమం లో బడంగ్ పేట్ కార్పొరేషన్ అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి,రామిడి సూర కర్ణ రెడ్డి,మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి,మాజీ సర్పంచ్ నడిగూడెం యాదగిరి,మాజీ కార్పొరేటర్లు,బీజెపి నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో దారుణం... హాస్పిటల్ సీజ్

ఫోన్ లోనే వైద్యం వికటించి ఇద్దరు శిశువుల మృతి .. తనకేం పట్టనట్టుగా వ్యవహరిస్తున్న డాక్టర్ అనుష రెడ్డి
విజయలక్ష్మి హాస్పిటల్ సీజ్ చేసిన జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు






**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం మంచాల్ రోడ్ లోని విజయలక్ష్మి హాస్పిటల్ లో దారుణం చోటుచేసుకుంది. వైద్యం వికటించి కవల మగ పిల్లలు ఇద్దరు మృతి చెందడం జరిగింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందినట్లు బంధువుల ఆరోపిస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన కీర్తన అనే మహిళ గర్భవతి అని తెలిసిన నాటి నుంచి, ఇబ్రహీంపట్నంలోని విజయలక్ష్మి హాస్పిటల్ లో ప్రతినెల, ఇదే హాస్పిటల్లో వైద్య పరీక్షలు చేయించు కోవడం జరిగిందని తెలిపారు. సదరు మహిళలకు గర్భంలో కవలలు ఉన్నారని వైద్యులు తెలపడం జరిగిందన్నారు. ఆదివారం ఉదయం 4 గంటల సమయంలో గర్భిణీకి కడుపులో నొప్పిగా ఉందని విజయలక్ష్మి హాస్పిటల్ అనూష రెడ్డిని ఫోన్ ద్వారా సంప్రదించగా ఆమె నేను వస్తున్నాను, పేషెంట్ ను హాస్పిటల్కు తీసుకురామ్మని తెలపడంతో, ఆరు గంటల సమయంలో ఐదు నెలల గర్భిణి కీర్తనను విజయలక్ష్మి హాస్పిటల్ కి తీసుకురాగా, డాక్టరు గైనాకలాజిస్ట్ అనూష రెడ్డి లేకపోవడంతో ఆమె సిబ్బందికి, ఫోన్ చేసి, ఫోన్ కాల్ ద్వారా వైద్యం అందించడం జరిగిందన్నారు. హాస్పిటల్ తీసుకొచ్చిన నాలుగైదు గంటల వరకు డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో సరైన వైద్యం అందక గర్భంలోని ఇద్దరు పిల్లలు మరణించారని గర్భిణీ భర్త గణేష్ తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు వచ్చిన డాక్టర్ జరిగిన ప్రమాద గురించి తెలుసుకున్న తర్వాత, పేషెంట్ తరపు బంధువులు ఆమెను అడగగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ జరిగిపోయిన దాన్నికి మనమేం చేయలేదని నిర్లక్ష్యంగా మాట్లాడడం జరిగిందన్నారు. పైగా మిగిలిన 30 వేల రూపాయలు హాస్పిటల్ బిల్లులు క్లియర్ చేయవలసిందిగా డిమాండ్ చేశారని అన్నారు. విజయలక్ష్మి హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని బంధువులు హాస్పిటల్ ముందు బైటాయించి ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు హాస్పిటల్ వద్దకు చేరుకుని ఆందోళనకారులను అదుపు చేశారు. ఇదే హాస్పిటల్లో గతంలో ఒక దారుణం చోటుచేసుకుంది. కుటుంబ నియంత్రణ కోసం వచ్చిన మహిళకు ఆపరేషన్ చేసిన డాక్టర్ అనుష రెడ్డి. సదరు మహిళకు ఆపరేషన్ ఫెయిల్ కావడంతో, తిరిగి మళ్లీ గర్భం దాల్చడంతో అబార్షన్ చేసి, మళ్లీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసిన డాక్టర్. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మంచాల రోడ్డులో ఉన్న విజయలక్ష్మి హాస్పిటల్ ను సందర్శించిన జిల్లా వైద్య అధికారి వెంకటేశ్వరరావు, మృతి చెందిన శిశువుల తల్లిదండ్రులను పరామర్శించి, విషయం తెలుసుకుని, డాక్టర్ అనూష రెడ్డి నిర్లక్షం కారణంగానే కవల శిశువులు మృతి చెందారని, జిల్లా వైద్యాధికారి నిర్ధారణ చేసినట్లు తెలిపారు. ఇదే హాస్పిటల్లో గత నెల రోజుల క్రితం జరిగిన సంఘటనను గుర్తు చేస్తూ, విజయలక్ష్మి హాస్పిటల్ సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. హాస్పిటల్లో ఉన్న రోగులను కోటి వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ లకు తరలించడం జరిగింది. విజయలక్ష్మి హాస్పిటల్ డాక్టర్ అనుష రెడ్డి పోలీసుల అదుపులో ఉన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రైవేట్ హాస్పిటల్లో డాక్టర్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుందని, పలువురు జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేయడం జరిగింది. వైద్యాధికారి ఇబ్రహీంపట్నంలో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ లను సందర్శించి సరైన పత్రాలు లేకున్నా కొనసాగుతున్న హాస్పిటల్ లను వెంటనే సీజ్ చేయడం జరుగుతుందని ఒక మాటలో తెలిపారు.

# ప్రతిభ ఉన్న విద్యార్థినికి ప్రోత్సాహం



**కరీంనగర్, మహా:** ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళుతున్న విద్యార్థిని ప్రోత్సహించి మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,బూరుగుపల్లి గ్రామానికి చెందిన గడ్డం శతాక్షి లండన్ వెళ్లడానికి అవసరమైన రూ.70 వేల విలువైన విమాన టికెట్ అందజేసిన ఎమ్మెల్యే*ఖండాంతరాలు దాటి చదువుకొని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లాగా భారతదేశానికి ఖ్యాతి తీసుకురావాలని సూచించిన ఎమ్మెల్యే*తేది. మే 6, కరీంనగర్ ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించి అండగా నిలవడంలో ముందుంటారని మరోసారి నిరూపించుకున్నారు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళుతున్న విద్యార్థినిని ప్రోత్సహించి మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు ఎమ్మెల్యే,కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన గడ్డం శతాక్షికి లండన్ లోని గ్రీన్ విచ్ యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదవడానికి అవకాశం వచ్చింది.ఉన్నత చదువుల కోసం శతాక్షి దేశాలకు వెళుతున్న విషయాన్ని స్థానికుల ద్వారా ఎమ్మెల్యే దృష్టికి వచ్చింది.ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడంలో ముందుండే ఎమ్మెల్యే మేడిపల్లి శతాక్షికి ఆర్థిక సహకారం అందజేయాలని నిర్ణయించుకున్నారు.మంగళవారం కరీంనగర్ లోని తన నివాసంలో శతాక్షిని అభినందించి, స్వంత ఖర్చులతో కొనుగోలు చేసిన రూ. 70 విలువైన విమాన టికెట్ ను అందజేశారు.ఖండాంతరాలు దాటి చదివి, నిర్మాత అంబేద్కర్ వలె భారతదేశానికి ఖ్యాతిని తీసుకురావాలని విద్యార్థినికి ఎమ్మెల్యే సూచించారు.విమాన టికెట్ను అందజేసిన ఎమ్మెల్యేకు శతాక్షీ కృతజ్ఞతలు తెలిపారు.కాగా విద్యార్థినిని ప్రోత్సహించి ఆర్థిక సహకారం అందజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను మండల ప్రజలు అభినందించారు....

# పంట మార్పిడి విధానం పాటించాలి

సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి
"రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, మహా:** రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తూ సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం కొత్తపల్లి మండలం బద్దిపల్లి రైతు వేదికలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ యూరియా విరివిగా వాడడం వల్ల భవిష్యత్ తరాలకు నేల పనికిరాకుండా పోయే అవకాశం ఉందని అన్నారు. వీలైనంత తక్కువగా రసాయనాలను వాడాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వల్ల దిగుబడిలో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. దుక్కి దున్నడం నుండి పంట కోత వరకు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని అన్నారు. నాసిరకం, ఎరువులు పురుగుమందులు వాడకం వల్ల రైతు నష్టపోయే అవకాశం ఉందని, డీలర్ల వద్ద కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని తెలిపారు. లాభాలు సాధించడంలో, నేల స్వభావాన్ని తిరిగి పొందడంలో పంట మార్పిడి విధానం ఉత్తమమైనదని అన్నారు. వరికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వకుండా చిరుధాన్యాలు, పండ్లు, పూల మొక్కలు, కూరగాయల పెంపకం వంటి వాటిని సాగు చేయాలని, తద్వారా అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చని తెలిపారు. ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా విపరీతమైన కాలుష్యంతో పాటు వృక్ష సంపదకు వాటిల్లుతోందని వివరించారు. చెట్లను కాపాడాలన్నారు. అనంతరం సాగు విధానానికి అవలంబించవలసిన పద్ధతులపై కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, శాస్త్రవేత్తలు ఉషారాణి, మధుకర్ రావు, శ్రావణి, విద్యా భాస్కర్, మదన్మోహన్ రెడ్డి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## ఈ ల్యాండ్ కు అసలు ఓనర్లు మీరేనా అయినా పర్లేదు.. ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జాకు ప్రయత్నం చేస్తాం

అసలు ఓనర్లను ఇబ్బందులకు గురిచేసి తామే నిజమైన ఓనర్లుగా చలామణి అవుతాం
ఎక్కువ మాట్లాడితే దాడులకు పాల్పడతాం
ఫిర్యాదు చేసిన అధికారులు మమ్ములనీ ఎవరు ఏం చేయలేరు అనే ధీమా??
ఇది నేటి కబ్జా రాయల తీరు
ఖాళీ స్థలం కనబడితే చాలు గద్దల వాలిపోతున్న నవాజ్,ఉమర్ జాఫ్రీ,అఖిల్,మల్లికార్జున్ ముఠా
వీళ్ళ ఆగడాలను అడ్డుకుని కఠిన చర్యలు తీసుకోవాలని లాండ్ ఓనర్ల డిమాండ్




**బాలాపూర్ మహా:** మహేశ్వరం నియోజకవర్గం,బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోనీ 18వ వార్డ్ బాలాజీ టౌన్షిప్ సర్వే నెంబర్ 90/ఆ/6/లో కొల్లూరు శ్రీనివాస్ అతను కుటుంబ సభ్యులకు చెందిన ఐదు ఎకరాల,6 గుంటల ప్రవేట్ భూమిని కబ్జాకు ప్రయత్నిస్తున్న కేటుగాళ్లు. ప్రైడ్ ఇండియా కంపెనీ కి సంబంధించిన ప్రైవేటు గుండాలు స్థలం వద్ద సెక్యూరిటీ లుగా ఉన్న వారి పై దాడి కి ప్రయత్నం. గత నెల లో 50 మంది ప్రైవేట్ రౌడీలతో స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను,హార్డ్ డిస్క్ ను ధ్వంసం చేశారు. ఈరోజు మరోసారి 20 మంది గుండాలు అక్కడికి వచ్చి హంగామా సృష్టించి హల్ చల్ చేశారు.నవాజ్,ఉమర్ జాఫ్రీ,అఖిల్,మల్లికార్జున్ అనే వ్యక్తులు ఒక మాఫియాగా ఏర్పడి ఖాళీ స్థలాలు కనపడితే కబ్జాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని అడ్డు అదుపు లేకుండా వ్యవహరిస్తున్నారని వీరి పై కఠిన చర్యలు తీసుకోవాలని ల్యాండ్ ఓనర్స్ డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ, పేద ప్రజలను ఇబ్బంది పెడుతున్న రాక్షసుల పై ఇప్పటికైనా పోలీసులు స్పందించి మా భూమి నీ అక్రమంగా కబ్జాకు ప్రయత్నిస్తున్న వీరి పై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నత అధికారులను కోరారు. వీరి పై బాలాపూర్ పోలీస్ స్టేషన్,ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు ల్యాండ్ ఓనర్లు తెలిపారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోకుంటే శాంతి భద్రతల కు విఘాతం కలిగిస్తారని తెలిపారు. వీరు ఇప్పటికే అనేక ప్రాంతాల్లో కబ్జాలకు పాల్పడ్డారని తెలిపారు. ఇలాంటి వారి పై కఠిన చర్యలు తీసుకుంటేనే,అక్రమంగా భూమిని కబ్జా చేయాలనుకునే వారికి గుణపాఠం అవుతుందని అన్నారు.

# కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నకిలీ ఇంజన్ ఆయిల్ దందా

నకిలీ ఇంజన్ ఆయిల్ మాఫియా గుట్టు రట్టు చేసిన అమ్మ న్యూస్ చానల్ కరీంనగర్ టీమ్..





**కరీంనగర్, మహా :** కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న జిల్లాల్లో కల్తీ ఇంజన్ ఆయిల్ మాఫియా దారుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది, ద్విచక్ర, ఫోర్ వీలర్ వాహనాల్లో వాడి నల్లగా మరిన తరువాత బయట పడపోసే ఆయిల్ ను సహితం వదలడంలేదు ఆయిల్ మాఫియా దారులు, కరీంనగర్ పట్టణం అడ్డగా చేసుకొని కల్తీ ఇంజన్ ఆయిల్ విక్రయించే దుకాణాలు మొత్తం నాలుగు ఉన్నాయి, బండి ఇంజన్ నడవడానికి వాడి పడవేసినా ఇంజన్ ఆయిల్ నల్లరాగులో మారుతుంది దాని ఉపయోగించని రీతిలో మారిపోతుంది.. కానీ అదే ఆయిల్ మాఫియా దారుల పాలిట డబ్బులు సంచి నింపుకునే వరంగా మారిందంటే నమ్మక తప్పదు, వాడిన తర్వాత బయట పడా పోసే ఆయిల్ ను డ్రమ్ముల కొద్ది కొని దాన్ని రిఫాండ్ చేసి, బ్రాండెడ్ కంపెనీల పేరిట , లీటర్ లేదా రెండు, మూడు లీటర్ల డబ్బాల్లో పోసి వాటిపై బ్రాండెడ్ స్టిక్కర్ అతికించి , ఆటో మొబైల్, మెకానిక్ షాపుల తో పాటు ఇతర గ్రామాలకు రోజువారీగా లక్షల లీటర్ల కల్తీ ఆయిల్ తరలిస్తూ ఏదేచ్ఛగా డబ్బులు దండుకుంటున్నారు కల్తీ దారులు, మళ్ళీ రిఫాండ్ అయిన ఆయిల్ వాహనాల్లో వాడినట్లైతే వాహనాలు త్వరగా ఇంజన్ సమస్యలతో పాడవుతాయి,ఈ దందా కరీంనగర్ హెడ్ క్వార్టర్ గా రిఫైండ్ అవుతున్నదాని అమ్మ న్యూస్ చానల్ ద్వారా నిఘా పెట్టి చిత్రీకరించడం వాటి డిటైల్స్ సేకరణ చేసి అధికారులకు కనువింపు కలిగే విధంగా చానల్లో టెలికాస్ట్ చేయడం జరిగింది, ఆయిల్ మాఫియా దారుల తో స్థానిక ప్రజల వాహనాలు త్వరగానే మెకానిక్ షెడ్డుకు చేరుకుంటున్నాయని , వందల రూపాయలు పెట్టీ కొన్న ఇంజన్ ఆయిల్ కల్తీ ఆయిల్ కావడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు,ఇప్పటికైనా తూనికల, విజిలెన్స్ ,అధికారులు మూడు ముడుపులు ఆరు డబ్బుల సంచులు ఉంటే చాలని వ్యవహరించకుండా, ఈ కల్తీ ఇంజన్ ఆయిల్ మాఫియాను అరికట్టే విధంగా అధికారులకు కనువింపు కలగాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.



# నేడు కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం

**ఆదిలాబాద్ మహా :** నేడు తేది 07052025 బుధవారం ఉదయం 9గంటలకు ఆదిలాబాద్ పట్టణం విద్యానగర్ లోని లోని విద్యుత్ తరంగిణి ఫంక్షన్ హాల్లో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజక వర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటలో తెలిపారు. టీపీసీసీఉపాధ్యక్షులు,పరిశీలకులు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ నందన్ ,టీపీసీసీ కార్యదర్శి పరిశీకులు చిట్ల సత్యనారాయణ , మాజీ కేంద్ర మంత్రి వేణు గోపాలచారి ఇట్టి కార్యక్రమానికి హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు. కావున నియోజక వర్గంలోని పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు కార్యక్రమానికి హాజరు కాగలరని ఆయన ప్రకటనలో కోరారు.

# బైక్ పై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి




**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్కుడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ముందు రోడ్డు ప్రమాదం జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం నాగిరెడ్డి గూడ నుంచి శంషాబాద్ కు కూలి పని కోసం తన బైక్ టీఎస్ 07 EZ 8029 పై వెళ్తున్న అర్జున్ శంషాబాద్ మండలం నర్కూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ముందు రెడీమిక్స్ టిప్పర్ లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో శంషాబాద్ పోలీసులు డెడ్ బాడీని మార్చురికి తరలించారు. రెడీమిక్స్ టిప్పర్ లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



# బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

**నిర్మల్ మహా :** నిర్మల్ జిల్లా తానూర్ మండలం బోసి గ్రామంలో బాల్యవివాహం జరగబోతున్న సమాచారం అందుకున్న బాలల పరిరక్షణ శాఖ అధికారులు సకాలంలో స్పందించి వివాహాన్నిఅడ్డుకున్నారు. బోసి గ్రామానికి చెందిన 14ఏళ్ల మైనర్ బాలికకు వివాహం జరుగుతున్నట్టు సమాచారం అందడంతో బాలల సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. ముధోల్ సీఐ మల్లేష్, సీడిపిఒ సరోజినీ, ఏసీడిపిఒ నాగలక్ష్మి, బాల పరిరక్షణ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు అక్కడికి చేరుకొని వివాహాన్ని నిలిపివేశారు. ఇరు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి, బాల్యవివాహం వల్ల ఏర్పడే దుష్పరిణామాలను వివరించారు. అనంతరం ఇద్దరు కుటుంబాల నుంచి కూతురు మేజర్ అయ్యే వరకు వివాహం జరిపించబోమని హామీ పత్రాలు రాసుకున్నారు.ఈ సంఘటనపై స్పందించిన స్థానికులు, బాలిక భవిష్యత్తు దృష్ట్యా చర్యలు తీసుకున్న అధికారులకు అభినందనలు తెలిపారు.

# ఆదిలాబాద్ లో ఆటో దొంగల ముఠా అరెస్ట్



**ఆదిలాబాద్ మహా :** ఆటోలు దొంగిలించి అమ్ముకుంటున్నఅంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్టు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.బుధవారం జిల్లాకేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన వివరాలు వెల్లడించారు. ఆటోలు దొంగిలించి ఇంజన్ నంబర్, చస్సిస్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్లు తీసివేసి నకిలీ నంబర్ ప్లేట్లు బిగించి అమ్మడానికి యత్నించిన ఏడుగురు సభ్యుల దొంగల ముఠాలో షారుక్ పఠాన్, అల్తాఫ్ ఖాన్ ,షేక్ ఖయ్యూం, అఫ్సర్ బేగ్, అసద్ ఖాన్ అరెస్ట్ చేసామని A1యూసఫ్, A2 సయ్యద్ ఇద్దరు పరారీలో ఉన్నట్టు తెలిపారు. నిందితుల నుండి దాదాపు 27 లక్షల విలువ చేసే 27 ఆటోలు ఐదు సెల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారులను పట్టుకోవడానికి డీఎస్పీ జీవన్ రెడ్డి ఆధర్వ్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసామన్నారు.వాహనాలు కొనేముందు ప్రజలు సరైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.దొంగలను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కే ఫణిధర్, సి సి ఎస్ ఇన్స్పెక్టర్ సిహెచ్ చంద్రశేఖర్, ఎస్సై సయ్యద్ ముజాహిద్, రూరల్ పోలీసు , సిసిఎస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సేంద్రియ ఎరువుల ద్వారా అధిక దిగుబడి

శాస్త్రవేత్త పవన్ చంద్రారెడ్డి



**రాజేంద్రనగర్, మహా :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మదుల్లా నగర్ రైతు వేదికలో పండించే పంటలపై అన్నదాతలకు మంగళవారం జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో నేల ఆరోగ్య యజమాన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె పవన్ చంద్రారెడ్డి పాల్గొన్నారు. శాస్త్రవేత్త పవన్ చెందారెడ్డి మాట్లాడుతూ రైతులు వాతావరణ ఆధారిత పంటలను పండించాలన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడకం జరగాలి, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడకం పంట మార్పిడి ద్వారా నూతన వంగడాలు, విత్తన శుద్ధి, కలుపు గురించి రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల ద్వారా అధిక దిగుడని పొందవచ్చు అన్నారు. రైతులు వర్ష ఆధారిత పంటలను పండించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్వేత, రాఘవేందర్, చిన్న గోల్కొండ సొసైటీ చైర్మన్ బొమ్మ దవణాకర్ గౌడ్, బాల్రెడ్డి, శేఖర్ రెడ్డి, బిక్షపతి, ధన్పాల్ రెడ్డి, వినయ్, పరుశురాం, చంద్రయ్య, పాండు, అంజయ్య, సాయిలు, సురేందర్, వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నాగోలు సాయినగర్ కాలనీ గుడిసెల్లో మంటలు...

## కళ్ళ ముందే కాలి బూడిదైనా పేదల గుడిసెలు..

భారీ అగ్ని ప్రమాదంలో 30 గుడిసెలు దగ్ధం.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో మంటలు అంటుకొని ప్రమాదం..

పేలి ఎగిరిపడిన గ్యాస్ సిలిండర్లు.. సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే, మధుయాష్కీ గౌడ్.. సర్వం కోల్పోయిన భాధితులు



**ఎల్బీనగర్,మహా:** నాగోల్ సాయినగర్ కాలనీలో సర్వేనెంబర్ 96/1లోని ప్రభుత్వ భూమిలో పేద ప్రజలు గుడిసేలు వేసుకుని నివాసం ఉంటున్న ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది ఈ ప్రమాదంలో దాదాపు 28 గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి, మరో రెండు పాక్షికంగా దగ్ధమయ్యాయి.అగ్ని ప్రమాదంలో తీవ్రంగా ఆస్తి నష్టం జరిగిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సంఘటన, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలు సాయినగర్ కాలనీలో గత కొన్నేళ్లుగా పేద ప్రజలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం 11:15 నిమిషాల సమయంలో గుడెసెల మీద నుండి విద్యుత్ వైర్లు ఉన్నాయి.గుడిసెల్లో నివాసం ఉండే రాకేష్,దీఫిక ఇంటి దగ్గర మొదటగా సర్క్యూట్ తో మంటలు అంటుకున్నాయి.దీంతో ఒక్క సారిగా ఇంటిపై మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన స్థానికులు, ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు అక్కడ నుండి ప్రాణ భయంతో పరుగులు తీసి బయట పడ్డారు. దీంతో గుడిసెలో మంటలు వ్యాప్తి చెంది అక్కడ ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో మిగతా గుడిసెలకు మంటలు అంటుకున్నాయి.ఆ తర్వాత అవి మిగతా గుడిసెలకు వ్యాప్తించాయి.దీంతో మంటలు పెద్ద ఎత్తున్న వ్యాప్తి చెందడంతో స్థానికులు నాగోలు పోలీస్ లకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది పోలీసులు వచ్చే సరికి పెద్ద ఎత్తున్న మంటలు అంటుకొని గుడిసెలు కలిపోయాయి. గుడిసెలల్లో ఉన్న 8 గ్యాస్ సిలిండర్లు పెద్ద ఎత్తున్న పెలడంతో స్థానికులు, స్థానిక కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. ఫైర్ సిబ్బంది,డిఆర్ఎఫ్, ఎల్బీనగర్ జోన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల నుండి పెద్ద పోలీస్లు అక్కడికి చేరుకుని గుడిసెల్లో చిక్కుకున్న వారిని బయటకు తరతలించి దాదాపు గంటన్న పాటు శ్రమించి మంటలను అందుపులోకి తీసుకువచ్చారు. ఇందులో సుమారు 28 గుడిసెలు పూర్తిగా దగ్ధం, మరో 02 గుడిసెలు పాక్షికంగా దగ్ధమయ్యాయి.

### ఇదే గుడిసెల్లో 2012 మార్చ్ లో భారీ అగ్ని ప్రమాదం

2012లో మార్చి నెలలో సాయినగర్ గడిసెలల్లో జరిగిన ప్రమాదంలో 450 గుడిసెలు పూర్తిగా కలిపోయయి. గతంలో జరిగిన ప్రమాదంలో ఓ చిన్నారి మృతి చెందగా, మరో ముగ్గురి గాయాలతో బయట పడ్డారు. ఈ క్రమంలో ప్రభుత్వం బాధితులను గుర్తించి గత ప్రభుత్వం బాధితులకు సుమారు 300 మందికి పట్టా పర్టిఫికెట్ అందజేశారు..

### మంటల్లో కాలిపోయిన డబ్బులు, సర్టిఫికెట్స్, సామాన్లు, బట్టలు

సాయినగర్ గుడిసెల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసెల్లో దగ్ధమైన సంఘటనలో గుడిసెల్లో ఉన్న డబ్బులు, సర్టిఫికెట్స్, సామాన్లు, ఇంటి పట్టాలు, బట్టలు, పుస్తకాలు, గృహోపకరణాలు, బియ్యం, బట్టలు పూర్తిగా మంటల్లో సర్వం కలిపోయాయని బాధితులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాలి బూడిదైన తీరును స్థానికులు చూసి చలించిపోయారు. పెళ్లి కోసం దాచుకున్న డబ్బులు బంగారం కూడా కాలిపోయిందని ఇక మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. 2012లో జరిగిన ప్రమాదంలో సర్వం కోల్పోయి ఉన్నామని. ఇప్పుడు ఇప్పుడే.. కోలుకుంటున్న సమయంలో మరో సారి అగ్ని ప్రమాదం జరిగి తమ వస్తువలు, సామాన్లు, నగదు పూర్తిగా కాలిపోయిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో సామాన్లు కలిపోయి పేద ప్రజలు రోడ్డు మీద పడ్డారు.

### సాయినగర్ గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తాం : మధుయాష్కీ

అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన సాయి నగర్ గుడిసెల ప్రాంతాన్ని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ సందర్శించారు. వ్యక్తిగతంగా బాధితులకు రూ.3000 చొప్పున ఆర్థిక సాయం,బియ్యం పంపిణీ చేస్తానని తెలిపారు. కలెక్టర్, ఆర్డిఓ తో మాట్లాడి తక్షణ సహాయం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం ఘటనలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన నాగోల్ సాయి నగర్ గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇంటి పథకం కింద పక్కా గృహాలను కట్టించి ఇస్తామని మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు.తమ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది అని భరోసా కల్పించారు. బాధితులకు న్యాయం చేసే విషయం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సాయినగర్ గుడిసవాసులు అందరికీ ప్రభుత్వం అందిస్తున్న రూ. 5లక్షల ఆర్థిక సహాయంతో పక్కా ఇల్లు కట్టించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టర్ గారితో మాట్లాడడం జరిగిందన్నారు. అంతే కాకుండా వ్యక్తిగతంగా బాధిత కుటుంబాలకు రూ. 3వేల చొప్పున వ్యక్తిగతంగా తక్షణ సహాయాన్ని అందజేశారు. అంతే కాకుండా ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలకు రూ.6 వేలచొప్పున నగదు, బియ్యం అందించేలా ఇప్పటికే కలెక్టర్, ఆర్డీవో, తహసిల్దార్ అంగీకరించారని పేర్కొన్నారు. కానీ రూ.12 వేల చొప్పున ఇవ్వాలని కలెక్టర్ తో మాట్లాడినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ఇల్లు నిర్మించుకునేంతవరకు తలదాచుకునేందుకు అధికారులతో మాట్లాడి స్థానికంగా ఉన్న జిహెచ్ఎంసి వార్డు కార్యాలయంలో బస ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. దాచుకున్న డబ్బులు, పిల్లల పుస్తకాలు, రేషన్ ఆధార్ కార్డులు సర్టిఫికెట్లతో పాటు శుభకార్యాల కోసం కొన్న బట్టలు, బంగారం కూడా మంటల్లో కాలి బూడిదవడం ఎంతో ఆవేదన కలిగిస్తుందని తెలిపారు.బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

### బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అదుకోవాలి

**- ఎమ్మెల్యే సుధీర్రెడ్డి..**

కలిపోయిన ప్రతి గుడిసెకు ప్రభుత్వం తరుపున ఆదుకొని పది లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే వారికి ఆర్థిక అవసరాల క్రింద వెంటనే రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### ప్రభుత్వం తక్షణ సాయం అందించాలి

**- ఎంపీ ఈటెల రాజేందర్..**

సాయినగర్ కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సంఘటనా స్థలాన్ని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ తో కలిసి పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో సర్వం కలిపోయిన పేదలకు ప్రభుత్వం అందుకోవాలని అన్నారు.

# మామునూర్ డివిజన్ పోలీస్ స్టేషన్లను సందర్శించిన సీపీ

## రౌడీ షీటర్ల పై ప్రత్యేక దృష్టి సారించాలి

## సెక్టార్ల వారీగా అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్న సీపీ





**వరంగల్ మహా;** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ప్రీత్ సింగ్ మంగళవారం మామునూర్ డివిజన్ పరిధిలోని మామునూర్, గీసుగొండ, ఏనుమాముల, పోలీస్ స్టేషన్లను సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా మామునూర్ డివిజన్ పోలీస్ స్టేషన్లను సందర్శించిన పోలీస్ కమిషనర్ ముందుగా ఆయా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సిపి సంబంధిత స్టేషన్ ఇన్స్పెక్టర్ ను అడిగి తెలుసుకొవడంతో పాటు, స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి, స్టేషన్ పరిధిలో ఎన్ని సెక్టార్లు వున్నాయని సెక్టార్ వారిగా ఎస్.ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్.ఐలను అడిగి తెలిసుకున్నారు. అంత కాకుండా స్టేషన్ల వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలను కూడా పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు పలుసూచనలు చేస్తూ ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ షీటర్ల ఇండ్లను సందర్శించి వారి స్థితిగతుల పై ప్రత్యక్షంగా ఆరా తీయాలని, ఆర్థిక సైబర్ నేరాలకు సంబంధించి కేవలం కేసు నమోదు చేయడమే తమ బాధ్యతనే కాకుండా సైబర్ నేరాలకు సంబంధించి నేరానికి పాల్పడిన నేరస్థుల మూలాలను కూడా అధికారులు దర్యాప్తులో కనిపెట్టి నిందితులను అరెస్టు చేయాలని సూచించారు ట్రై సిటి పరిధిలో గంజాయి తో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి క్రయ విక్రయాల పై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకై నిరంతరం పనిచేయాలని, నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకొసం నగరంలో నిరంతరం పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు సూచించారు. ఈ సందర్భన లో పోలీస్ కమిషనర్ వెంట ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూర్ ఏసిపి తిరుపతి, ఇన్స్పెక్టర్లు రమేష్, మహేందర్, రాఘవేందర్, తో పాటు స్టేషన్ ఎస్ఐ లు పాల్గోన్నారు.

# మలీన జల శుద్ధి కేంద్రాల అభివృద్ధికి నిధులు

## కేంద్ర గృహ పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సెక్రటరీ థిల్లాన్

జల్ హీ అమృత్" కార్యక్రమం పై డిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్ నుండి పాల్గొన్న సి డి ఎం ఏ, ఆస్కి ప్రతినిధులు నగరం నుండి హాజరైన కమిషనర్..



**వరంగల్ మహా;** మలిన జల శుద్ధి కేంద్రాల అభివృద్ధి ప్రోత్సాహక నిధులు అందజేయనున్నట్లు కేంద్ర గృహ పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సెక్రటరీ థిల్లాన్ అన్నారు. మంగళవారం డిల్లీ నుండి అమృత్ 2.0 లో ఎంపికైన నగరాల కమిషనర్ లు ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో హైదరాబాద్ నుండి సి డి ఏం ఏ డా.టి. కే శ్రీదేవి ఆస్కి ప్రతినిధి డా. శ్రీనివాస చారి నగరం నుండి కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కమిషనర్ తో పాటు ఇంచార్జి ఎస్ ఈ శ్రీనివాస్, ఈ ఈ లు రవి కుమార్, సంతోష్ బాబు, స్మార్ట్ సిటీ పి ఎం సి ఆనంద్ ఓలేటి, తదితరులు, పాల్గొన్నారు.



# పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వల పై టాస్క్ ఫోర్స్ దాడి

**వరంగల్, మహా;** వరంగల్ నగరంలోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాని గార్డెన్ వెనకాల టాస్క్ ఫోర్స్ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన సుమారు 1,75.000 విలువగల 50 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం తో పాటు 1 మొబైల్ ఫోన్, AP36w1415 నెంబర్ గల 1ఆటోను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఇన్స్పెక్టర్ జి బాబులాల్, ఇతర పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

# చిన్నారులు సమ్మర్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలి





- క్రీడలకు సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట
- నగర మేయర్ గుండు సుధారాణి
- సమ్మర్ క్యాంప్ ను పరిశీలించిన మేయర్, కమిషనర్

**వరంగల్ మహా;** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని నగర మేయర్ గుండు సుధారాణి పేర్కొన్నారు. మంగళవారం బల్దియా ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాఖేడే పరిశీలించారు. వారు పిల్లలతో కాసేపు బ్యాడ్మింటన్ ఆడారు. పిల్లలకు ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ క్రీడలు ఆడుతున్న పిల్లలకు అరటిపండు, ఉడికిన కోడిగ్రుడ్డు అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ నెల 1 నుండి 31 వరకు నెల రోజుల పాటు జరిగే ఈ సమ్మర్ క్యాంపు చిన్నారులకు క్రీడలపై ఆసక్తి పెంచడానికి దోహదపడతాయని, ఈ క్యాంప్ ను వినియగించుకుని క్యారం,.షటిల్, చెస్, టేబుల్ టెన్నిస్, జోడో, యోగా క్రీడలను నేర్చుకోవాలని అన్నారు. కోచ్ లు ప్రతి రోజు పిల్లలకు బేసిక్ లు నేర్పాలని, రెగులర్ గా వారు నేర్చుకొనేలా ప్రోత్సహించాలని కోరారు. పిల్లలకు బ్యాచ్ల వారిగా ప్రతి రోజు ఉదయం , సాయంత్రం శిబిరం నిర్వహిస్తున్నట్టు, హాజరైన పిల్లలకు టీ షర్ట్స్ , స్నాక్స్ అందజేయడం తో పాటు శిక్షణ పూర్తయిన పిదప ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ శంకర్ లింగం, కోచ్ లు, సిబ్బంది, బాల బాలికలు, వారి సంరక్షకులు, తదితరులు, పాల్గొన్నారు.

# జిల్లాలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి.. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, మహా;** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. భూభారతి పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మంగళవారం వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లి, దివిటిపల్లి గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను గురించి తెలుసుకున్నారు. భూభారతి చట్టంపై అవగాహన కల్పించి,వారికున్న సందేహాలను నివృత్తి చేశారు. భూ సంబంధిత సమస్యలు ఉన్నవారు నిర్ణీత ప్రొఫార్మాలో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు.ఫార్మార్ రిజిస్ట్రర్ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించి, వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తోందని తెలిపారు. సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు విస్తీర్ణం హెచ్చుతగ్గులు వారసత్వ భూములు భూ స్వభావం, తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం వంటి వాటిని పరిష్కరిస్తున్నామన్నారు.



### జడ్.పి.హెచ్.ఎస్ వేసవి శిక్షణ శిబిరాన్ని పరిశీలించిన కలెక్టర్

వర్ధన్నపేట మండలం కట్రియాల జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలను కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. పిల్లలు క్రీడలు మరియు ఇతర సహా పాఠ్య కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలని, తద్వారా వారి శారీరక, అభిజ్ఞ సామర్థ్యాలను ప్రోత్సహించడంతో పాటు విద్యార్థుల సజాత్మకతను పెంపొందించాలని అధికారులను సూచించారు.

### ధాన్యం కొనుగోలు కేంద్ర కలెక్టర్ పరిశీలన

దమ్మన్నపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి కొనుగోలు కేంద్రాల నిర్వహణ సిబ్బంది పనితీరు ధాన్యం నాణ్యత రైతుల అవసరాలు, డబ్బుల చెల్లింపు తదితర అంశాలను పరిశీలించారు. కేంద్రాల్లో ప్యాడి క్లీనర్లు, గన్ని బ్యాగులు, టార్పాలిన్లు, తాగునీటి అందుబాటులో ఉండాలన్నారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యదర్శికంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. సమస్యలు ఉన్నాయని ధాన్యం ఎగుమతి కొరకు ప్రస్తుతం ఉన్న ఒక లారీ ట్రిప్పు బదులు మరో లారీ ఏర్పాటు చేయాలని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అదనంగా లారీ ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ను చరవాణిలో కలెక్టర్ ఆదేశించారు.

### ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పరిశీలన

వర్ధన్నపేట మండలంలోని వర్ధన్నపేట, ఉప్పరపల్లి, రామవరం గ్రామాలలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అయితే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల స్థితిగతులను పరిశీలించారు.

# డివిజన్లో పర్యటించిన కార్పొరేటర్

## స్థానిక సమస్యల పై ప్రజలను అడిగి తెలుసుకున్న కార్పొరేటర్



**వరంగల్ మహా;** వరంగల్ మహానగర పాలకసంస్థ 16వ డివిజన్ పరిధిలోని ధర్మారం రైల్వే గేట్ అవతల పారిశుధ్య పనులను, మంచినీటి సరఫరా లో ఏర్పడ్డ సమస్యలను స్థానిక కార్పొరేటర్ సుంకరి మనీషా శివకుమార్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్లో మంచినీటి సరఫరాకు అదనంగా పైప్ లైన్ అవసరముందని అలాగే ఒక మురుగు కాల్వ పై కల్వర్టు నిర్మాణం చేపట్టవలసిన అవసరం ఉందని ఇందుకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో ప్రతిపాదలను రూపొందించి త్వరలోనే సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలను తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాదాసి బిక్షపతి, సింగిరెడ్డి నాగరాజు, బొలిశెట్టి రాజేష్, దుర్శెట్టి రాజు, జవాన్ రమేష్,వాటర్ మెన్ సారయ్య, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



# సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయండి

**నగర మేయర్ గుండు సుధారాణి**

**మేయర్, కమిషనర్ నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న అధికారులు**

**వరంగల్, మహా;** అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యు జీ డి) పై సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డి పి ఆర్) సిద్ధం చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్లో ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక తయారీ పై కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ యూజీడి రూపకల్పనపై జోన్ల వారిగా సమగ్ర అధ్యయనం జరిపి సాంకేతిక పరిశీలన ను దృష్టి లో ఉంచుకొని తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్ ఈ శ్రీనివాస్, ఈ ఈలు రవికుమార్, సంతోష్ బాబు, మాధవి లత, తదితరులు, పాల్గొన్నారు.

## నగరంలో ఫుడ్ సేఫ్టీ టాస్కోఫోర్స్ బృందం

# ఆకస్మిక దాడులు

**భవాని స్వీట్స్ కార తయారీ కేంద్రంలో తనిఖీలు**

**అపరిశుభ్రత, బూజు పట్టిన సరుకులు, తుప్పు పట్టిన యంత్రాలతో ఆహార పదార్థాల తయారీ**



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా గొర్రెకుంట లోని బెల్ ఇండస్ట్రీ స్వీట్స్ , కార మిక్చర్ తయారీ కేంద్రంపై తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్కోర్స్ బృందం ఆకస్మిక దాడులు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్టం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్స్పెక్టర్స్ రోహిత్ రెడ్డి , స్వాతి, శ్రీషికలతో కూడిన బృందం వరంగల్ జిల్లా గొర్రెకుంట లో భవాని స్వీట్స్ కార తయారీ కేంద్రం (బెల్ బ్రాండ్) లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తయారీ కేంద్రం నందు కార, స్వీట్స్ తయారు చేసే పరిసరాలు పూర్తిగా అపరిశుభ్రంగా ఉండడం, ఫుడ్ హ్యాండ్లర్స్ సరైన పరిశుభ్రతను పాటించకపోవడం, హెయిర్ క్యాప్స్ తో పాటు హ్యాండ్ గ్లౌజ్ ఉపయోగించకపోవడం, తుప్పు పట్టిన యంత్రాలను ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించడం, గోడలు, పైకప్పులో కూడిన బూజు పట్టి ఉండడం, కాలం చెల్లిన బిస్కెట్స్, ఇతర కన్ఫెక్షనరీ పదార్థాలు, శనగపప్పు లాంటివి గుర్తించడం పై ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్ అయిన వి. జ్యోతిర్మయి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అప్పటికప్పుడే సుమారు రెండు లక్షలు నలభై వేల రూపాయల విలువగల 1800 కిలోల కాలం చెల్లిన శనగపప్పు, సుమారు లక్షల 50 వేల రూపాయల విలువ గల లేబుల్ డిఫెక్ట్స్ కలిగినటువంటి ఇతర కన్ఫెక్షనరీ ప్రజల ఆరోగ్యానికి భంగం కలగకూడదని వాటిని ఎఫ్ ఎస్ ఎస్ 2006, చట్టం ప్రకారం సీజ్ చేసి నోటీసులు జారీ చేయడం జరిగింది. అంతేకాకుండా అనుమానిత శాంపిల్ లను సేకరించి హైదరాబాద్ లో గల ల్యాబ్ కు పంపించి నివేదిక ఆధారంగా కల్తీ అని నిర్ధారణ అయితే వారిపై చట్టరీత్య చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ రకమైన ప్రజారోగ్యంతో చెలగాటమాడే ఆహార తయారీదారులు, ఆహారం అమ్మేవారు ఆహార పరిరక్షణ ప్రమాణాలను పాటించి, ఫుడ్ సేఫ్టీ నిబంధనలకు అనుగుణంగా ఆహారాన్ని ప్రజలకు విక్రయించాలని హెచ్చరించారు. లేనిపక్షంలో చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తూ అవసరమైతే సంబంధిత శాఖ సహాయంతో సీజ్ కూడా చేస్తామని హెచ్చరించడం జరిగింది. ఆహారాన్ని తయారుచేసి, నిలువ చేసి,రవాణా చేసి ప్రజలకు అమ్మే వ్యాపారస్తులు కల్తీల పట్ల అవగాహన పెంచుకోవాలని, ప్రజలకు స్వచ్ఛమైన శుచి, శుభ్రత గల ఆహార పదార్థాలను ఆహార వ్యాపారులు సరైన బాధ్యతతో వ్యవహరించాలని, సురక్షితమైన కల్తీ లేని ఆహారాన్ని ప్రజలకు అందించవలసిందిగా వ్యాపారస్తులను టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వి. జ్యోతిర్మయి సూచించారు. ఈ టాస్క్ ఫోర్స్ దాడులలో అధికారులతో పాటు పలువురు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో మారుతున్న ఉద్యోగుల ప్రాధాన్యతలు

భారత్‌లో ఉద్యోగుల ప్రాధాన్యాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఏఓఎన్ 2025 ఎంప్లాయ్ సెంటిమెంట్ స్టడీ ప్రకారం ఈ ఏడాది దేశంలో 82 శాతం మంది తాము చేస్తున్న సంస్థలు మారాలని భావిస్తున్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా 60 శాతంగా ఉంది. మెరుగైన పని ప్రాంత ప్రయోజనాలు, కెరీర్ అవకాశాల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను ఈ ధోరణి నొక్కి చెబుతుంది.

**ప్రయోజనాలకే ప్రాధాన్యత**

ఏఓన్ రిపోర్ట్‌లోని అంశాల ప్రకారం.. భారతీయ ఉద్యోగులు 76 శాతం మంది తమ అవసరాలకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు ఉండాలని కోరుకుంటున్నారు. అందుకోసం ప్రస్తుతం ఉన్న వెసులుబాట్లను విడిచిపెట్టడానికైనా సిద్ధంగా ఉన్నారని అధ్యయనంలో వెల్లడైంది. ఉద్యోగులకు కోరుకునే ఐదు అత్యంత విలువైన ప్రయోజనాలను విశ్లేషించింది. వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ ప్రోగ్రామ్‌లు: ఫ్లెక్సిబుల్ వర్క్ అరేంజ్‌మెంట్లు, రిమోట్ వర్క్ ఆప్షన్ల కోసం ఉద్యోగులు అధికంగా ఆసక్తి చూపుతున్నారు.



**మెడికల్ కవరేజ్:**

ఆసుపత్రిలో చేరడం, అవుట్ పేషెంట్ సేవలు వంటి ఆరోగ్య సంరక్షణ చర్యలు మెరుగ్గా ఉన్న కంపెనీలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

**కెరీర్ డెవలప్‌మెంట్ అవకాశాలు:**

ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగంతోపాటు మెరుగైన ఉద్యోగావకాశాల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, మెంటార్‌షిప్, లీడర్ షిప్ ట్రైనింగ్ వంటి సదుపాయాలు కోరుకుంటున్నారు.

**వేతనంతో కూడిన సెలవులు:**

పెయిడ్ సెలవులు, పేరెంటల్ లీవ్, వెకేషన్ల కోసం సెలవులు ఇచ్చే కంపెనీలకు ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటున్నారు.

**రిటైర్మెంట్ పొదుపు పథకాలు:**

పెన్షన్ పథకాలు, ఆర్థిక స్థిరత్వాన్ని పొందడానికి పెట్టుబడి అవకాశాలకు పెద్దపీట వేస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా 13 శాతం మంది ఉద్యోగులతో పోలిస్తే భారత్‌లో కేవలం 7 శాతం మంది మాత్రమే తక్కువ సరైన గుర్తింపు ఇవ్వడం లేదనే భావనతో ఉంటున్నారు. వైద్య కవరేజ్ తరతరాలుగా అత్యధిక విలువ కలిగిన ప్రయోజనాల్లో ఒకటిగా ఆవిర్భవించింది. జెన్ ఎక్స్(196580 మధ్య జన్మించినవారు), జెన్ వై(19801995 మధ్య జన్మించినవారు) జెన్ జెడ్(19952005 మధ్య జన్మించిన వారు) కంటే ఎక్కువగా వైద్య సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. జెన్ జెడ్ ఉద్యోగులు వర్క్‌లైఫ్ సమతుల్యతకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

**వెల్‌నెస్ ప్రోగ్రామ్‌లకు ప్రాముఖ్యత**

కొవిడ్ తర్వాత కంపెనీలు తమ బ్రాండ్‌ను రూపొందించడంలో వెల్‌నెస్ ప్రోగ్రామ్‌ల ప్రాముఖ్యతను గుర్తిస్తున్నాయని ఏఓఎన్‌లోని టాలెంట్ సొల్యూషన్స్ ఫర్ ఇండియా హెడ్ నితిన్ సేథీ పేర్కొన్నారు. మెరుగైన ఆరోగ్యం, వెల్‌నెస్, ఫైనాన్షియల్ ప్లానింగ్ సొల్యూషన్స్‌ను తమ పాలసీల్లో పొందుపరిచేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇది ఉద్యోగులను నిలుపుకోవడానికి, టాప్ టాలెంట్‌ను ఆకర్షించడానికి ఎక్కువ అవకాశం కల్పిస్తుందని చెప్పారు. యువ నిపుణుల్లో పదవీ విరమణ, ఆర్థిక ప్రణాళిక అంశాలు ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయని ఏఓఎన్ హెల్త్ అండ్ వెల్త్ సొల్యూషన్స్ హెడ్ యాష్లే డిసిల్వా పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం, స్తబ్దుగా ఉన్న వేతనాల ఆందోళనలే ఈ మార్పుకు కారణమని చెప్పారు. ఇది ఉద్యోగులు దీర్ఘకాలిక ఆర్థిక భద్రతపై దృష్టి పెట్టడానికి దారితీస్తుందని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న జాబ్ మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి 43% మంది భారతీయ ఉద్యోగులు తమ ఏఐ నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఆసక్తిగా ఉన్నారని ఏఓఎన్ అధ్యయనం తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఈ ధోరణి 35 శాతంగా ఉంది. 10 శాతం మంది ఉద్యోగులు తమ నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ కోసం వారి సంస్థలు పెద్దగా ఆసక్తి చూపడం లేదని చెప్పారు.



# దుబాయ్‌లో భారతీయ బిలియనీర్‌కు ఐదేళ్లు జైలు శిక్ష

దుబాయ్‌లో నివసిస్తూ.. విలాసవంతమైన జీవితం గడుపుతున్న భారతీయ బిలియనీర్ 'బల్వీందర్ సింగ్ సాహ్ని'కి మనీలాండరింగ్ కేసులో 5 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ అక్కడి కోర్టు ఆదేశించింది. ఈ శిక్షా కాలం పూర్తయిన తరువాత దేశాన్ని వదిలిపోవాలని సాహ్నిని దుబాయ్ కోర్టు ఆదేశించినట్లు స్థానిక మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. షెల్ కంపెనీల నెట్‌వర్క్ ద్వారా 150 మిలియన్ దిర్హామ్‌లను లాండరింగ్ చేయడం, అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలకు పాల్పడినందుకు బల్వీందర్ సింగ్ సాహ్ని శిక్ష.. జరిమానా విధించడం జరిగింది. అంతే కాకుండా ఈ వ్యాపారవేత్త నుంచి 5,00,000 AED (రూ. 1.14 కోట్లు) తో పాటు 150 మిలియన్ AED (రూ. 344 కోట్లు) జప్తు చేయాలని కోర్టు ఆదేశించిందని గల్ఫ్ న్యూస్ నివేదించింది. 'అబు సబా' గా ప్రసిద్ధి చెందిన బల్వీందర్ సింగ్ సాహ్ని.. రాజ్ సాహ్ని గ్రూప్ (RSG) ఫౌండర్. ఈ కంపెనీ యూఏఈలో మాత్రమే కాకుండా.. అమెరికా, ఇండియాతో సహా అనేక దేశాల్లో విస్తరించి ఉంది. విలాసవంతమైన జీవితం గడిపే సాహ్ని.. ఎమిరేట్స్‌లో అత్యంత ఖరీదైన నంబర్ ప్లేట్‌లలో ఒకటైన 'డీ5' కోసం సుమారు రూ. 75 కోట్లు ఖర్చు చేశారు. కార్ల ధరల కంటే కూడా.. ఆ కార్ల కోసం కొనుగోలు చేసిన నెంబర్స్ ధరలే ఎక్కువని సాహ్ని.. ఓ సందర్భాల్లో చెప్పారు. ఈయన వద్ద అత్యంత ఖరీదైన కార్లు ఉన్నాయి. మనీలాండరింగ్ కేసులో సాహ్నితో పాటు.. అతని కొడుకుతో కలిపి మరో 32 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో కొందరు తప్పించుకుని తిరుగుతున్నట్లు సమాచారం.

# లాభాలకు బ్రేక్..

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



మంగళవారం ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాలను చవిచూసింది. సెన్సెక్స్ 155.77 పాయింట్లు లేదా 0.19 శాతం నష్టంతో 80,641.07 వద్ద, నిఫ్టీ 81.55 పాయింట్లు లేదా 0.33 శాతం నష్టంతో 24,379.60 వద్ద నిలిచాయి. సీసీఎల్ ప్రొడక్ట్స్ ఇండియా, ఓరియంట్ బెల్, గ్రీన్‌లామ్ ఇండస్ట్రీస్, తత్వ చింతన్ ఫార్మా కెమ్, పాలీ మెడిక్యూర్ కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. సెంచరీ ఎంకా, బ్యాంక్ ఆఫ్ బరోడా, కేసాల్ఫ్స్ ఇండియా, ప్రైమ్ ఫోకస్, ఓరియంటల్ హోటల్స్ వంటివి నష్టాలను చవిచూశాయి.

# టీ రూ.10.. సమోసా, కాఫీ రూ.20: ఎయిర్‌పోర్ట్‌లో తక్కువ ధరల్లో..




టీ రూ.10, కాఫీ రూ.20 అనే ధరలు వింటుంటే ఆ ఏముంది? రోడ్డు పక్కన టీ బండిలో రేట్లు అవే కదా అందులో వింతేముంది?.. అనిపించవచ్చు కానీ... ఆ రేట్లు ఎయిర్‌పోర్ట్‌లోని కేఫ్‌లో అంటే..మాత్రం విస్తుపోవాల్సిందే. అవును మరి.. రాబోయే కొన్నేళ్లలో విమానాలు ఎక్కని వారు అంటూ ఉండరేమో కానీ.. విమానాశ్రయాల్లో టీ కూడా తాగని వారు మాత్రం బోలెడంత మంది ఉంటారేమో అనే అంచనాలు ఉండేవి. ఎందుకంటే..రాను రాను విమానయానం అందుబాటులోకి వస్తోంది. కానీ ఎయిర్‌పోర్ట్స్‌లో కనీసం టీ కూడా అందుబాటు ధరలో ఉండడం లేదు కాబట్టి. అడపాదడపా ఎయిర్‌లైన్స్ వాళ్లు అందించే ఆఫర్లు ఒక్కోసారి రైలు ఛార్జీల కన్నా కూడా తక్కువగా ఉంటున్నాయి. దీనివల్ల సామాన్యులకు కూడా విమాన ప్రయాణం సాధ్యమవుతోంది. కానీ విమానాశ్రయాల్లో కాసింత సేద తీరాలని టీ, కాఫీ లాంటివి తాగాలనుకున్నా, సమోసా, బిస్కెట్స్ వంటి చిరు తిండి తినాలన్నా అదేదో పెద్ద కలలాగా మారింది. ఎందుకంటే ఆ ధరల పట్టీ ఇంకా సామాన్యులకు అందనంత దూరంలోనే ఉంది. మన శంషాబాద్ విమానాశ్రయాల వంటి చోట అయితే కేఫ్స్‌లో ధరలు చూస్తే విమానం ఎక్కకుండానే కళ్లు తిరుగుతాయ్. రకరకాల అవకాశాలవల్ల.. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లోనో విమాన ప్రయాణం చేయాల్సిన అవసరం ఇప్పుడు మధ్యతరగతి వారికి కూడా తప్పడం లేదు. అయినప్పటికీ విమాన ప్రయాణీకులు అంటేనే సంపన్నులు అనే రీతిలో ఈ ధరలు ఉండడం సామాన్యులకు మింగుడు పడని పరిస్థితి. ఈ నేపథ్యంలో పూణే అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుల కోసం సరికొత్తగా 'ఉడాన్ యాత్రి కేఫే' అనే సేవను ప్రారంభించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 'ఇప్పటికి ఎదురు చూసిన రోజులు ముగిశాయి టీ రూ.10, కాఫీ రూ.20 కి పూణె విమానాశ్రయంలో అందుబాటులోకి రాబోతున్నాయి,' అని ఆయన ట్వీట్ చేశారు.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# భారత్ మాపై దాడి చేసేది అప్పుడే..

## పాక్ మాజీ దౌత్యవేత్త సంచలన ట్వీట్!



**ఇస్లామాబాద్:** 1971లలో నాటి భారత్‌పాకిస్తాన్ యుద్ధ సమయంలో భారత్ మాక్ డ్రిల్స్ నిర్వహించింది. 1971 తర్వాత ఇలాంటి డ్రిల్స్ బుధవారం జరగనుంది. ఈ తరుణంలో పాకిస్తాన్ మాజీ దౌత్య వేత్త (హైకమిషనర్) అబ్దుల్ బాసిత్ సంచలన ట్వీట్ చేశారు. రష్యా విక్టరీ డే తర్వాత భారత్.. పాకిస్తాన్‌పై దాడి చేసే అవకాశం ఉందని ట్వీట్‌లో పేర్కొన్నారు. వచ్చే వారం,11,12వ తేదీలలో దాడి చేయొచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు. మరోవైపు, పాక్‌పై దాడి చేసేందుకు భారత్ సర్వం సిద్ధమవుతోంది. ఈ మేరకు ముహూర్తం దాదాపుగా ఖరారైంది. సరిహద్దులకు ఆవలివైపు నుంచి ఉగ్ర దాడులను పనిగట్టుకుని ఎగదోస్తున్న దాయాదికి బుద్ధి చెప్పేందుకు రంగం సిద్ధమైంది. ఈ వారాంతంలోపు ఎప్పుడైనా పాక్‌పై భారీ స్థాయి 'ఆపరేషన్' జరగవచ్చని కేంద్ర ప్రభుత్వ అత్యున్నత వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో మోదీ సర్కార్ సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. యుద్ధ సన్నద్ధతను సరిచూసుకునేందుకు బుధవారం పలుర కాల మాక్ డ్రిల్స్ నిర్వహించాల్సిందిగా రాష్ట్రాలను ఆదేశించింది. 1971 తర్వాత ఇలాంటి డ్రిల్స్ జరగనుండటం ఇదే తొలిసారి కావడం విశేషం! అప్పుడు కూడా పాక్‌తో యుద్ధం నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకున్నారు. డ్రిల్స్‌లో భాగంగా వాయుదాడుల సైరన్లు మోగించి అప్రమత్తం చేస్తారు. ప్రజలను ఉన్నపళంగా ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలు చేపడతారు. ఈ విషయమై ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రణాళికలను తక్షణం అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర హోం శాఖ పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రాలకు అడ్వైజరీ జారీ చేసింది. డ్రిల్స్‌లో భాగంగా సమర్థమైన పౌర రక్షణ చర్యలు చేపట్టడంలో ప్రజలకు, ముఖ్యంగా యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. పహల్గాం ఉగ్ర దాడుల వంటివి జరిగితే దీటుగా ఎదుర్కోవడం ఎలాగో నేర్పిస్తారు. స్వీయరక్షణ చర్యలతో పాటు విద్యుత్ సరఫరా బ్లాకౌట్ వంటివి జరిగితే తక్షణం ఎలా స్పందించాలో, కీలక మౌలిక వనరుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరిస్తారు.

# స్వచ్ఛందంగా వెళ్లిపోతే వెయ్యి డాలర్లు

## అక్రమ వలసదారులకు అమెరికా ఆఫర్



**వాషింగ్టన్:** అమెరికాలో పెద్ద సంఖ్యలో తిష్టవేసిన అక్రమ వలసదారులను బయటికి పంపడమే లక్ష్యంగా పెట్టుకున్న ట్రంప్ ప్రభుత్వం మరో కొత్త పథకాన్ని తీసుకువచ్చింది. సొంత దేశాలకు స్వచ్ఛందంగా వెళ్లిపోయే వలసదారులకు వెయ్యి డాలర్ల చొప్పున అందజేస్తామని సోమవారం హోం ల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్ఎస్) విభాగం ప్రకటించింది. నిర్బంధానికి గురి కావడం, బలవంతంగా వెళ్లగొట్టడం కంటే స్వచ్ఛందంగా సొంత దేశాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు 'సీబీపీ హోమ్' యాప్ ద్వారా అంగీకారం తెలిపిన వారికి ప్రయాణ ఖర్చులను సైతం చెల్లిస్తామని డీహెచ్ఎస్ తెలిపింది. అమెరికాను వీడే అక్రమ వలసదారులకు ఇదే అత్యుత్తమ, సురక్షిత మార్గమని డీహెచ్ఎస్ సెక్రటరీ క్రిస్టీ నోమ్ తెలిపారు.



# భారత్‌కు మా సంపూర్ణ సహకారం: జపాన్

**న్యూఢిల్లీ:** ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరముందని భారత్, జపాన్ పేర్కొన్నాయి. భారత్ లక్ష్యంగా సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడే పాకిస్తాన్ విధానాన్ని ఖండించాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సోమవారం జపాన్ రక్షణ మంత్రి జనరల్ నకటనీ ఢిల్లీలో సమావేశమయ్యారు. పాక్‌తో ఉద్రిక్తతలు ముదిరిన సమయంలో ఈ భేటీ జరగడం గమనార్హం. పహల్గాం ఉగ్ర ఘటన, తదనంతర పరిణామాలను సవివరంగా చర్చించారు. ఉగ్రవాదాన్ని రూపుమాపే విషయంలో భారత్‌కు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని నకటనీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు రక్షణ రంగంలో సహకారం ప్రాంతీయ భద్రతకు సంబంధించిన అంశాలను చర్చించారు. సముద్రయానంతో పాటు యుద్ధ ట్యాంకుల ఇంజిన్లు, యుద్ధ విమానాల ఇంజిన్ల తయారీ రంగంలో సహకరించుకోవాలని నిర్ణయించారు.

# యూఎన్‌వో కీలక భేటీలో పాకిస్థాన్‌కు భంగపాటు



యూఎన్‌వో సమావేశంలో పాకిస్థాన్‌కు భంగపాటు ఎదురైంది. పహల్గాం ఉగ్రదాడిని యూఎన్‌వో తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ చెప్పిన పలు అంశాలను సభ్య దేశాలు తిరస్కరించాయి. లష్కరే తోయిబా ప్రమేయంపై పాక్‌ను యూఎన్‌వో ఆరాతీసింది. ప్రత్యేకంగా ఒక మతం వారినే కాల్చి చంపడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పాకిస్థాన్ క్షిపణి పరీక్షలపై యూఎన్‌వో ఆందోళన వ్యక్తం చేసింది పహల్గాం ఉగ్రదాడి ప్రస్తావన లేకుండా భారత్ చర్యలపైనే ఫోకస్ పెట్టిన పాక్.. సింధూ నది జలాల ఒప్పందాన్ని నిలిపివేయడాన్ని భద్రతా మండలిలో ప్రస్తావించింది. భారత్, పాకిస్థాన్ సంయమనం పాటించాలని యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ అన్నారు. భద్రతామండలిలో భారత్‌పై తప్పుడు ఆరోపణలు చేసిన పాకిస్తాన్.. భారత్ చర్యలను తప్పు బట్టే ప్రయత్నం చేసింది. ఎలాంటి తీర్మానం లేకుండానే భద్రతా మండలి రహస్య సమావేశం ముగిసింది. భారత్, పాక్ నడుమ ఉద్రిక్తతలు కొన్నేళ్లలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన వెలిబుచ్చింది. వాటి కట్టడికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఇరు దేశాలకూ సూచించారు. అందుకు దన్నుగా నిలిచేందుకు ఐరాస సిద్ధమని తెలిపారు. సమస్యలకు యుద్ధం పరిష్కారం కాదని హితవు పలికారు. సాయుధ ఘర్షణ మొదలైతే పరిస్థితి అదుపు తప్పుతుందని ఆందోళన వెలిబుచ్చారు. "పహల్గాం ఉగ్ర దాడి అనంతరం భారత్‌లో పెల్లుబుకుతున్న జనాగ్రహాన్ని, ఆక్రోశాన్ని అర్థం చేసుకోగలను. ఆ పాశవిక దాడిని మరోసారి ఖండిస్తున్నా. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఇలా పౌరులను లక్ష్యం చేసుకోవడం దారుణం. దీనికి పాల్పడ్డవారికి చట్టపరంగా కఠిన శిక్షపడాల్సిందే" అన్నారు.


# గాజా ఆక్రమణకు పన్నాగం!



**టెల్ అవీవ్:** హమాస్ మిలిటెంట్ సంస్థను సమూలంగా నాశనం చేసి, గాజా స్ట్రిప్‌ను పూర్తిగా హస్తగతం చేసుకొనే దిశగా ఇజ్రాయెల్ అడుగులు వేస్తోంది. మొత్తం గాజా భూభాగాన్ని నిరవధికంగా ఆక్రమించే ప్రణాళికకు ఇజ్రాయెల్ మంత్రివర్గం సోమవారం ఆమోద ముద్ర వేసింది. ఇందుకోసం ఓటింగ్ నిర్వహించారు. గాజా ఆక్రమణకు కేబినెట్ సంపూర్ణ అంగీకారం తెలిపింది. ఇద్దరు సీనియర్ అధికారులు ఈ విషయం వెల్లడించారు. అక్కడి నుంచి ఎప్పుడు ఖాళీ చేయాలన్న దానిపై ఇజ్రాయెల్ కేబినెట్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అంటే గాజా స్ట్రిప్ రాబోయే కొన్ని దశాబ్దాల పాటు ఇజ్రాయెల్ ఆధీనంలోనే ఉండిపోయే అవకాశాలు లేకపోలేదు. హమాస్‌ను ఓడించి, బందీలను విడిపించడమే లక్ష్యంగా రంగంలోకి దిగాలని వేలాది మంది రిజర్వ్ సైనికులకు ఇజ్రాయెల్ సైన్యం పిలుపునిచ్చింది. పాలస్తీనా భూభాగంలో అతిత్వరలోనే భీకర స్థాయిలో సైనిక ఆపరేషన్ ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. హమాస్‌ను ఖతం చేయాలన్న పట్టుదలతో ఇజ్రాయెల్ వ్యవహరిస్తోంది. ఇజ్రాయెల్ నిర్ణయంపై అంతర్జాతీయ సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడం ఖాయమని నిపుణులు చెబుతున్నారు. గాజాను ఆక్రమించడం అంత సులభం కాదంటున్నారు.

**అమల్లోకి ట్రంప్ ప్లాన్!**

40కిలోమీటర్లకుపైగా పొడవు, 20 కిలోమీటర్ల వెడల్పు ఉండే గాజాను ప్రపంచంలోనే అతిపెద్ద బహిరంగ జైలుగా పరిగణిస్తుంటారు. గాజాలోని పాలస్తీనా పౌరులను ఇతర దేశాలకు తరలించి, గాజాను అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో ప్రకటించారు. దీనిపై ప్రపంచ దేశాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇజ్రాయెల్ మిత్రదేశాలు సైతం తప్పుపట్టాయి. ట్రంప్ ప్లాన్‌లో భాగంగానే గాజాను పూర్తిగా హస్తగతం చేసుకోవడానికి ఇజ్రాయెల్ ఎత్తుగడలు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 50 శాతం గాజా భూభాగం ఇజ్రాయెల్ అధీనంలోకి వచ్చింది. మిగిలిన ప్రాంతాన్ని సైతం త్వరలో ఆక్రమించబోతోంది. అయితే, గాజా ప్రజలను ఏం చేస్తారన్నది ఇంకా తెలియరాలేదు. వారందరినీ దక్షిణ గాజాకు తరలించనున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్ కేబినెట్ తాజా నిర్ణయం పట్ల బందీల తీవ్రస్థాయిలో కుటుంబ సభ్యులు మండిపడ్డారు. హమాస్ మిలిటెంట్ల జోలికి వెళితే బందీలెవరూ ప్రాణాలతో మిగలరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాజాను ఆక్రమించాలన్న ఆలోచన మానుకోవాలని కోరుతున్నారు.




# బాలీవుడ్ అమ్ముడు పోయింది

## ప్రకాశ్ రాజ్ సంచలన వ్యాఖ్యలు!

ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ (Prakash Raj ) బాలీవుడ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందీ చిత్ర పరిశ్రమలో సగం మంది నటీనటులు ప్రభుత్వానికి అమ్ముడుపోయారని, అందుకే వారు ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయడానికి వెనుకాడుతున్నారని ఆరోపించారు. రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను బహిరంగంగా వెల్లడించే ప్రకాశ్ రాజ్, తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, బాలీవుడ్‌లో తనకు అవకాశాలు తగ్గడానికి కారణాలను వివరించారు. "నేను సూటిగా మాట్లాడతాను. రాజకీయ పరిణామాలపై నా అభిప్రాయాన్ని బహిరంగంగా చెబుతుంటాను. దీని వల్ల భవిష్యత్తులో తమకు ఇబ్బందులు వస్తాయని భావించి, నాకు అవకాశాలు ఇవ్వడం లేదు. ఇలాంటి పరిస్థితులు వస్తాయని తెలిసిన తర్వాతే నేను గళం విప్పాలని నిర్ణయించుకున్నాను," అని ప్రకాశ్ రాజ్ తెలిపారు. ప్రభుత్వం చేసే తప్పిదాలను ప్రశ్నించాలనే ఆలోచన చాలా మందిలో ఉన్నప్పటికీ, ధైర్యంతో ముందుకు రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "సినిమా పరిశ్రమలో సగం మంది అమ్ముడు పోయినవారే. కొంతమంది మంచివారు ఉన్నప్పటికీ, ప్రశ్నించే ధైర్యం లేదు. నా సన్నిహిత మిత్రుడు ఒకరు, 'ప్రకాశ్, నీకు ధైర్యం ఉంది కాబట్టి మాట్లాడగలుగుతున్నావ్, మాకు అంత ధైర్యం లేదు' అని చెప్పారు. వారి పరిస్థితిని నేను అర్థం చేసుకోగలను. కానీ, చరిత్ర నేరాలు చేసిన వారిని క్షమించినా, మౌనంగా ఉండే వారిని మాత్రం క్షమించదు. ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి," అని ఆయన స్పష్టం చేశారు.

ప్రకాశ్ రాజ్ ఈ వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆయన తాజాగా సూర్య నటించిన 'రెట్రో' చిత్రంలో కనిపించారు. పవన్ కల్యాణ్ నటిస్తున్న 'ఓజీ', విజయ్ నటిస్తున్న 'జన నాయగన్' చిత్రాల్లో కూడా ఆయన కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# జీవితంలో ఇంకెప్పుడు దాని గురించి మాట్లాడను: సమంత

సమంత పేరు చెప్పగానే చాలామందికి ఆమె విడాకుల అంశమే గుర్తొస్తుంది. ఎందుకంటే అక్కినేని హీరో నాగచైతన్యని ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈమె.. నాలుగేళ్లకే విడాకులు ఇచ్చేసింది. అప్పట్లో చైతూ కంటే సామ్ పై ఎక్కువ విమర్శలు వచ్చాయి. కాలక్రమేణా ఆ విషయం గురించి అందరూ మర్చిపోయారు. తర్వాత కాలంలో అప్పడప్పుడు సామ్.. బయట మాట్లాడినప్పుడు కావొచ్చు, ఇన్ స్టాలో పోస్ట్ చేసే స్టోరీల వల్ల కావొచ్చు చిన్నపాటి ట్రోలింగ్ ఫేస్ చేస్తూ ఉంటుంది. ఇదంతా సమంతకు తెలియంది ఏమి కాదు. ఇక విడాకుల తర్వాత మయోసైటిస్ వ్యాధి గురించి బయటపెట్టడం, దాని చికిత్స కారణంగా చాన్నాళ్లుగా సినిమాలకు దూరంగా ఉన్న సమంత.. ఇప్పుడు 'శుభం' చిత్రాన్ని సిద్ధం చేసింది. సమంత నిర్మాతగా మారి తీసిన మొదటి సినిమా ఇది. మే 09న థియేటర్లలోకి రాబోతున్న సందర్భంగా రీసెంట్ గానే వైజాగ్ లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఇప్పుడు మంగళవారం హైదరాబాద్ లో విలేకరులతో సినిమా విశేషాలు మాట్లాడింది. అలానే తన వ్యక్తిగత జీవితం గురించి ఇకపై మాట్లాడనని, ఈ మేరకు తాను డిసైడ్ అయినట్లు చెప్పకొచ్చింది. ఎందుకంటే సమంత నుంచి విడాకులు తీసుకున్న నాగచైతన్య.. హీరోయిన్ శోభితని గతేడాది పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం వీళ్లిద్దరూ ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తున్నారు. మరోవైపు సామ్ కూడా 'ఫ్యామిలీ మ్యాన్' డైరెక్టర్ రాజ్ నిడమోరుతో రిలేషన్ లో ఉందనే కామెంట్స్ వినిపించాయి. పెళ్లి రూమర్స్ కూడా వస్తున్నాయి గానీ ఈ విషయంపై క్లారిటీ రావాల్సి ఉంది.



# త్వరలో నా డ్రీమ్ ప్రాజెక్ట్‌తో తిరిగొస్తా: కార్తీక్ సుబ్బరాజ్




'రెట్రో' సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తుంది. ఈ మూవీ తెలుగువారికి అంతగా నచ్చలేదు. కానీ, కోలీవుడ్‌లో దుమ్మురేపుతుంది. సూర్య, కార్తీక్ సుబ్బరాజ్ కాంబినేషన్‌లో వచ్చిన రెట్రోపై నెగటివ్ టాక్ వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతుంది. ఇంతలోనే వీరిద్దరి నుంచి మరో సినిమా రానుందని ప్రకటించారు. అయితే అది అత్యంత భారీ బడ్జెట్ కథా చిత్రంగా ఉంటుందని, అది తన డ్రీమ్ ప్రాజెక్టు అని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ పేర్కొన్నారు. రెట్రో సినిమాను కూడా సూర్యకు చెందిన 2డీ ఎంటర్‌టెయిన్‌మెట్ సంస్థ, దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్‌కు చెందిన స్టోన్ బెంచ్ స్టూడియోస్ సంస్థ కలిసి నిర్మించాయి. సంతోష్‌నారాయణన్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం భారీ అంచనాల మధ్య మేడే రోజున విడుదలయ్యి టాక్‌కు అతీతంగా విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ముఖ్యంగా నటుడు సూర్య నటనకు, గెటప్‌లకు ఆయన అభిమానులు ఫిదా అవుతున్నారు. చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే భారీ ఓపెనింగ్స్ రాబడుతోంది. దీంతో దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ ఒక భేటీలో పేర్కొంటూ సూర్య హీరోగా మరో చిత్రం కచ్చితంగా చేస్తానని చెప్పారు. అయితే అది అత్యంత భారీ బడ్జెట్ చిత్రంగా ఉంటుందని అన్నారు. దీంతో అందులో నటించడానికి సూర్య ఎక్కువ కాల్‌షీట్స్ కేటాయించాల్సి ఉంటుందన్నారు. అయితే సూర్య ఇప్పుడు వరుసగా చిత్రాలు చేస్తున్నారని, అందువల్ల ఈయనతో తెరకెక్కించే భారీ బడ్జెట్ కథా చిత్రం ఎప్పుడు ప్రారంభం అవుతుందో ప్రస్తుతం చెప్పలేనని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ చెప్పారు. ఇది నిజంగా సూర్య అభిమానులకు సంతోషపడే వార్తే అవుతుంది. కాగా నటుడు సూర్య ప్రస్తుతం ఆయన 45వ చిత్రాన్ని ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో చేస్తున్నారు. డ్రీమ్ వారియర్స్ సంస్థ నిర్మిస్తున్న ఇందులో నటి త్రిష నాయకిగా నటిస్తున్నారు. దీని తరువాత తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో నటించడానికి సిద్ధం అయ్యారు. దీని తరువాత వెట్రిమారన్ దర్శకత్వంలో వాడివాసల్ చిత్రంలో నటిస్తారని సమాచారం.

# డ్రగ్స్ కేసు.. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ అరెస్ట్



డ్రగ్స్ కేసుల వల్ల మలయాళ చిత్రసీమ హాట్ టాపిక్ అవుతోంది. కొన్నిరోజుల క్రితం ప్రముఖ నటుడు షైన్ టామ్ చాకో.. డ్రగ్స్ వాడుతున్నాడని తేలడంతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఆపై కాసేపటికే బెయిల్ పై రిలీజయ్యాడు. వారం క్రితం ఇద్దరు మలయాళ దర్శకుల్ని ఇదే తరహా కేసులో అరెస్ట్ చేశారు. ఇప్పుడు ఈ కేసులో మరో అప్డేట్. అరెస్ట్ అయిన సదరు దర్శకులు ఖలీద్ రెహ్మాన్, అష్రఫ్ హమ్జాతో పాటు ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కమ్ డైరెక్టర్ సమీర్ తాహిర్ ని కూడా సోమవారం నాడు ఇదే డ్రగ్స్ కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. వీళ్లతో ఇతడికి సంబంధం ఉందనే ఆరోపణలతోపాటు ఇతడు అద్దెకు తీసుకున్న అపార్ట్ మెంట్ లో వీళ్లు ఉండటం దీనికి కారణం. అయితే తాను అద్దెకు తీసుకున్న అపార్ట్ మెంట్ లో డ్రగ్స్ వినియోగిస్తున్నారనే విషయం తనకు తెలియదని సమీర్ తాహిర్.. పోలీసులతో చెప్పకొచ్చాడు. అయినా సరే నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్ స్టాన్స్ యాక్ట్ ప్రకారం ఇతడిపై కేసు నమోదు చేశారు. కానీ కాసేపటికే ఇతడు కూడా బెయిల్ పై బయటకొచ్చాడు.

## క్రీడా వార్తలు | SPORTS NEWS

# చరిత్ర సృష్టించిన సూర్య భాయ్


ముంబై ఇండియన్స్ స్టార్ ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున అత్యధిక సీజన్లు 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన ఆటగాడిగా అవతరించాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో కలుపుకుని సూర్య ఇప్పటివరకు మూడు సార్లు (2025 (510*), 2023 (605), 2018 (512)) ఓ సీజన్‌లో 500 ప్లస్ పరుగులు చేశాడు. సూర్య తర్వాత ముంబై ఇండియన్స్ తరఫున అత్యధిక సీజన్లు 500 ప్లస్ పరుగులు చేసిన ఘనత సచిన్ టెండూల్కర్ (2010, 2011), క్వింటన్ డికాక్‌కు (2019, 2020) దక్కుతుంది. వీరిద్దరు తలో రెండు సార్లు ఈ ఘనత సాధించారు. ఇవాళ (మే 6) గుజరాత్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సూర్య ఈ సీజన్‌లో 500 పరుగుల మార్కును తాకాడు. ఈ మ్యాచ్‌లో సూర్య సీజన్ లీడింగ్ రన్ స్కోరర్‌గానూ అవతరించాడు. ఈ మ్యాచ్‌లో 24 బంతుల్లో 5 ఫోర్ల సాయంతో 35 పరుగులు చేసిన సూర్య సాయి కిషోర్ బౌలింగ్‌లో షారుక్ ఖాన్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఈ సీజన్‌లో సూర్య 12 మ్యాచ్‌ల్లో 510 పరుగులు చేసి లీడింగ్ రన్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. ఆరెంజ్ క్యాప్ సాధించే క్రమంలో సూర్య విరాట్‌ను (505) అధిగమించాడు.

**ఈ సీజన్‌లో సూర్య చేసిన స్కోర్లు..**

29(26), 48(28), 27*(9), 67(43), 28(26), 40(28), 26(15), 68*(30), 40*(19), 54(28), 48*(23) & 35(24)

**ఈ సీజన్‌లో టాప్-6 లీడింగ్ రన్ స్కోరర్లు..**

సూర్యకుమార్ యాదవ్ 510



విరాట్ కోహ్లి 505
సాయి సుదర్శన్ 504
యశస్వి జైస్వాల్ 473
జోస్ బట్లర్ 470
శుభ్‌మన్ గిల్ 465

మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబైకు ఆది నుంచే కష్టాలు ఎదురయ్యాయి. రెండో బంతికే ఇన్ ఫామ్ బ్యాటర్ రికెల్టన్ (2) ఔటయ్యాడు. నాలుగో ఓవర్‌లో రోహిత్ శర్మ (7) పెవిలియన్‌కు చేరాడు. అనంతరం విల్ జాక్స్ (53), సూర్యకుమార్ యాదవ్ (35) కాసేపు నిలకడగా ఆడినా.. స్వల్ప వ్యవధిలో ఇద్దరూ ఔటయ్యారు. ఆతర్వాత వచ్చిన తిలక్ వర్మ (7), హార్దిక్ పాండ్యా (1), నమన్ ధిర్ (7) ఇలా వచ్చి అలా వెళ్లారు. 16.2 ఓవర్ల తర్వాత ముంబై స్కోర్ 123/7గా ఉంది. కార్బిన్ బాష్ (4), దీపక్ చాహర్ క్రీజ్‌లో ఉన్నారు. పవర్ ప్లేలో గుజరాత్ ఆటగాళ్లు మూడు సునాయాసమైన క్యాచ్‌లు వదిలి పెట్టినా ముంబై ఇండియన్స్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. గుజరాత్ బౌలర్లలో సాయికిషోర్ 2, సిరాజ్, అర్షద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ, రషీద్ ఖాన్, గెరాల్డ్ కొయెట్జీ తలో వికెట్ పడగొట్టారు. శుభ్‌మన్ గిల్ మూడు క్యాచ్‌లు పట్టాడు.

# ఆల్‌టైమ్ ఐపీఎల్ జట్టు.. రోహిత్ శర్మకు నో ప్లేస్

ప్రముఖ క్రికెట్ వెబ్‌సైట్ క్రిక్‌బజ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో క్రికెట్ దిగ్గజాలు ఆడమ్ గిల్‌క్రిస్ట్, షాన్ పొలాక్ తమ ఆల్‌టైమ్ ఐపీఎల్ జట్టును ప్రకటించారు. ఈ జట్టులో వారు ఏడుగురు భారత ప్లేయర్లు, నలుగురు విదేశీ ఆటగాళ్లకు చోటిచ్చారు. ఈ జట్టుకు సారధిగా ఎంఎస్ ధోనిని ఎంపిక చేశారు. ఆశ్చర్యకరంగా ఈ జట్టులో హిట్‌మ్యాన్ రోహిత్ శర్మకు చోటు దక్కలేదు. ఈ జట్టుకు ఓపెనర్లుగా క్రిస్ గేల్, విరాట్ కోహ్లిని ఎంపిక చేశారు. విదేశీ ప్లేయర్ల ఎంపికలో గిల్‌క్రిస్ట్ క్రిస్ గేల్ పేరు ప్రతిపాదించగా.. పొలాక్ ఏబీ డివిలియర్స్‌ను ఎంపిక చేశాడు. ఏబీడి ఆధునిక టీ20 బ్యాటింగ్‌కు ఆధ్యుడని పొలాక్ ప్రశంసించాడు. మిగిలిన రెండు విదేశీ ఆటగాళ్ల బెర్తల కోసం గిల్‌క్రిస్ట్, పొలాక్ కలిసి లసిత్ మలింగ, సునీల్ నరైన్ పేర్లను ప్రతిపాదించారు. బౌలింగ్ ఎరీనాలో మలింగ 'గోట్' అని పొలాక్ కీర్తించాడు. స్పిన్ బౌలింగ్ విభాగంలో రషీద్ ఖాన్ కంటే సునీల్ నరైనే మోస్ట్ వ్యాల్యుయబుల్ ప్లేయర్ అని పొలాక్ అభిప్రాయపడ్డాడు. వన్‌డౌన్‌లో బ్యాటింగ్ కోసం గిల్‌క్రిస్ట్, పొలాక్ కలిసి సురేశ్ రైనాను ఎంపిక చేశారు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు ఏబీడిని ఎంచుకున్నారు. ఐదో స్థానంలో సూర్యకుమార్ యాదవ్, కెప్టెన్ కమ్ వికెట్ కీపర్‌గా ఆరో స్థానంలో ఎంఎస్ ధోని, ఆల్‌రౌండర్ల కోటాలో రవీంద్ర జడేజా, సునీల్ నరైన్‌ను ఎంపిక చేశారు. పేస్ బౌలర్లుగా మలింగ, బుమ్రా.. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా చహల్‌ను ఎంపిక చేశారు. ఆడమ్ గిల్‌క్రిస్ట్, షాన్ పొలాక్ కలిసి ఎంపిక చేసిన ఐపీఎల్ ఆల్‌టైమ్ XI: క్రిస్ గేల్, విరాట్ కోహ్లి, సురేశ్ రైనా, ఏబీ డివిలియర్స్, సూర్యకుమార్ యాదవ్, ఎంఎస్ ధోని (కెప్టెన్ కమ్ వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, సునీల్ నరైన్, లసిత్ మలింగ, జస్ప్రీత్ బుమ్రా, యుజ్వేంద్ర చాహల్.



# పాకిస్థాన్‌తో క్రికెట్ వద్దే వద్దు..

## కోచ్‌గా నా బాధ్యత అదే..!



పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరుదేశాల దౌత్య సంబంధాలపై తీవ్ర ప్రభావం పడడమే కాకుండా వ్యాపార సంబంధాలు దెబ్బతిన్నాయి. అంతేకాదు దాయాదితో క్రికెట్ మ్యాచ్‌లకు ఫుల్‌స్టాప్ పెట్టాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత జట్టు కోచ్ గౌతం గంభీర్ (Gautam Gambhir) సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లు వద్దే వద్దని గౌతీ స్పష్టం చేశాడు. 'పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లు ఆడాలా? వద్దా? అనే ప్రశ్నకు నేను వద్దనే చెబుతాను. ఉగ్రదాడులు ఆగేంతవరకూ దాయాదితో క్రికెట్ సహా ఏ ఆట కూడా ఆడే ప్రసక్తే లేదు. అయితే.. పాక్‌తో క్రికెట్ ఆడడంపై తుది నిర్ణయం ప్రభుత్వానిదే. భారతసైనికుల ప్రాణాలు, ప్రజల భద్రత కంటే పాక్‌తో క్రికెట్ మ్యాచ్‌లు, బాలీవుడ్, ఇతర సంబంధాలు కూడా ముఖ్యం కాదని నేను ఇదివరకూ చెప్పాను' అని గౌతీ వివరించాడు. అంతేకాదు కోచ్‌గా తన పని ఆటగాళ్లను సెలెక్ట్ చేయడ కాదని గంభీర్ చెప్పాడు. జూన్‌లో ఇంగ్లండ్ సిరీస్ ఉన్నందున ఎవరిని ఎంపిక చేయాలనేది తన జాబ్ కాదని సెలవిచ్చాడు. 'కోచ్‌గా నా బాధ్యత ఆటగాళ్లను దారిలో పెట్టి జట్టును విజయపథాన నడిపించడమే. అంతేతప్ప ఆటగాళ్లను, టీమ్‌ను సెలక్ట్ చేయడం కాదు. ఆటగాళ్ల ఎంపిక అనేది పూర్తిగా సెలెక్టర్ల బాధ్యత. అందులో నా ప్రమేయం ఉండదు. వాళ్లు ఎంపిక చేసిన స్క్వాడ్‌లో మ్యాచ్‌కు అవసరమైన 11 మందిని తీసుకొని.. కోచింగ్ ఇస్తానంతే' అని గంభీర్ తెలిపాడు. టీ20 వరల్డ్ కప్ తర్వాత ద్రవిడ్ వారసుడిగా కోచ్ పదవి చేపట్టిన గంభీర్.. శ్రీలంక పర్యటనలో కొంతమేర విజయవంతం అయ్యాడు. అయితే.. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో, ఆ పై ఆస్ట్రేలియా గడ్డపై రోహిత్ సేన చిత్తుగా ఓడింది. దాంతో, గౌతీ కోచింగ్‌పై సందేహాలు వ్యక్తం చేశారు పలువురు. ఈమధ్యే.. సహాయక సిబ్బందిలోని అభిషేక్ నాయర్‌పై వేటు వేసిన బీసీసీఐ అతడికి పెద్ద షాకిచ్చిన విషయం తెలిసిందే.

# చెత్త ప్రదర్శన చేసిన ఆటగాళ్లతో జట్టు ప్రకటన.. కెప్టెన్‌గా రిషబ్ పంత్

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఘోరంగా విఫలమవుతున్న ఆటగాళ్లతో ఓ జట్టును రూపొందించింది ఐస్‌ల్యాండ్ క్రికెట్. ఈ జట్టుకు సారథిగా రిషబ్ పంత్‌ను ఎంపిక చేసింది. ఈ జట్టుకు ఐపీఎల్ 2025 మోసగాళ్లు, స్కామర్ల జట్టని నామకరణం చేసింది. ఈ జట్టులో రాహుల్ త్రిపాఠి, రచిన్ రవీంద్ర, ఇషాన్ కిషన్, రిషబ్ పంత్, వెంకటేశ్ అయ్యర్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, లియామ్ లివింగ్‌స్టోన్, దీపక్ హుడా, రవిచంద్రన్ అశ్విన్, మతీష పతిరణ, మహ్మద్ షమీకి చోటు కల్పించింది. పంత్‌ను కెప్టెన్ కమ్ వికెట్ కీపర్‌గా ఎంపిక చేసింది. ఈ జట్టును నిన్న తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ఐస్‌ల్యాండ్ క్రికెట్ ఎంపిక చేసిన ఈ టీమ్‌పై సోషల్‌మీడియాలో విపరీతమైన స్పందన వస్తుంది. నిజంగానే వీరు స్కామర్లు, మోసగాళ్లు అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. కోట్లలో డబ్బు తీసుకుని కనీస వందల విలువ చేసే ప్రదర్శన కూడా చేయలేకపోతున్నారంటూ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. కొందరేమే ఆటగాళ్లు ఎలా ఆడినా ఐస్‌ల్యాండ్ క్రికెట్ ఇలాంటి విమర్శలు చేయకూడదని సలహాలు ఇస్తున్నారు. కాగా, ఐస్‌ల్యాండ్ క్రికెట్‌కు ఇలాంటి వివాదాస్పద పోస్ట్‌లు చేయడం కొత్తేమీ కాదు. క్రికెట్‌కు సంబంధించిన అంశాలపై గతంలో చాలా సందర్భాల్లో వ్యంగ్యంగా స్పందించింది. ఇదిలా ఉంటే, మోసగాళ్లు.. స్కామర్లు అంటూ ఐస్‌ల్యాండ్ క్రికెట్ ఐపీఎల్ ఆటగాళ్లను విమర్శించడం సరి కాదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వారి అభిప్రాయాన్ని పక్కన పెడితే, ఐస్‌ల్యాండ్ క్రికెట్ ప్రకటించిన జట్టులోని ఆటగాళ్లందరూ తీసుకున్న డబ్బుకు న్యాయం చేయలేకపోతున్నారన్నది కాదనలేని సత్యం. రిషబ్ పంత్, వెంకటేశ్ అయ్యర్ లాంటి ఆటగాళ్లు 20 కోట్లకు పైగా మొత్తాన్ని తీసుకున్నా కనీస ప్రదర్శన చేయలేకపోతున్నారు. మిగతా ఆటగాళ్ల పరిస్థితి కూడా అలాగే ఉంది. మ్యాక్స్‌వెల్, లివింగ్‌స్టోన్ లాంటి విదేశీ ఆటగాళ్లయితే ఏదో హాలిడేకి వచ్చామన్నట్లు ఐపీఎల్‌ను చాలా ఈజీగా తీసుకుంటున్నారు. ఇషాన్ కిషన్, షమీపై వారి ఫ్రాంచైజీ ఎంతో నమ్మకముంచితే వారు ఆ నమ్మకాన్ని వమ్ము చేశారు. అశ్విన్ అయితే తనకున్న ఘన చరిత్రను చెత్త ప్రదర్శనలతో దిగజార్చుకున్నాడు. రాహుల్ త్రిపాఠి, దీపక్ హుడా లాంటి వారు కోట్లు మింగి గల్లీ క్రికెటర్ల కంటే హీనమైన క్రికెట్‌ను ఆడుతున్నారు. రాహుల్ త్రిపాఠి 3.4 కోట్లు, రచిన్ రవీంద్ర 4 కోట్లు, ఇషాన్ కిషన్ 11.25, దీపక్ హుడా 1.7 కోట్లు, రిషబ్ పంత్ 27 కోట్లు, వెంకటేశ్ అయ్యర్ 23.75, గ్లెన్ మ్యాక్స్‌వెల్ 4.2 కోట్లు, లియామ్ లివింగ్‌స్టోన్ 8.75 కోట్లు, రవిచంద్రన్ అశ్విన్ 9.75 కోట్లు, మతీష పతిరణ 13 కోట్లు, మహ్మద్ షమీ 10 కోట్లు



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com